RNI Reg-No. APTEL/2002/07373

Postal Registration No.VJ/215/2025-27

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Vijayawada, Visakhapatnam, Tirupati & Hyderabad

## మంత్రి నారా లోకేశ్ పనితీరుపై హైకోర్టు ప్రశంస




**అమరావతి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ మంత్రి నారా లోకేశ్ పని తీరును హైకోర్టు మిగతా 2లో..

సంపుటి :24 Vol. No.24 సంచిక : 58 Issue No. 58 విజయవాడ Vijayawada సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: బుధవారం 25-02-2026 Wednesday, February 25 2026 పేజీలు : 8 Pages: 8 వెల: రూ.1-00 Price Rs.1-00

# కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులకు శిక్షపడాల్సిందే


■ఆనాటి బోర్డును జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారు

■రసాయనాలతో కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని రుజువయ్యింది

■అసెంబ్లీలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్



**అమరావతి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులు ఎవరైనా సరే శిక్ష పడాల్సిందేనని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై శాసనసభలో జరిగిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. కల్తీనెయ్యిలో ఏ రసాయనాలు వాడారో ఆ పెరుమాళ్లకే తెలియాలి. జంతు సంబంధ రసాయనాలు ఉన్నాయని ఎన్‌డీడీబీ రిపోర్టు చెప్పింది. అది నెయ్యే కాదని సీబీఐ రిపోర్టు ఇచ్చింది. ఇది ధర్మానికి సంబంధించిన విషయం. సకల మతాలను గౌరవించడం ఈ దేశ సంస్కృతి. తితిదే పాత బోర్డును జగన్ ఎందుకు వెనకేసు కొస్తున్నారు? అంటే ఆయనకూ భాగం ఉన్నట్టే కదా?‘ అని పవన్ అన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యి ఉపయోగించలేదని ఇప్పటికే తేలిపోయిందన్నారు. నెయ్యిలో రసాయనాలు కలవలేదని వైసీపీ అబద్ధాలు చెబుతోందని.. అందుకే తాము వివరణ ఇవ్వాల్సి వచ్చిందని పవన్ తెలిపారు. కల్తీ నెయ్యి తయారీలోనూ సృజనాత్మకత చూపించారని.. నెయ్యి కావాలంటే పాల నుంచే కాదు రసాయనాల నుంచీ తయారు చేయొచ్చని నిరూపించారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వాధినేత మిగతా 2లో..




# వైకాపా హయాంలో కల్తీ నెయ్యితో 20 కోట్ల లడ్డూల తయారీ

- 2019-24 మధ్య 59.71లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగం
- రూ.231.51 కోట్ల అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ
- ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగానే కల్తీ జరిగిందని చెప్పా
- అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారు
- కల్తీపై దేవుడే తనతో విషయాలు వెల్లడించేలా చేశారు
- మహాపాపం' పేరిట లడ్డూ కల్తీ పై అసెంబ్లీలో సీఎం బాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

**అమరావతి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వైకాపా హయాంలో 20 కోట్ల లడ్డూలను కల్తీ నెయ్యితో తయారు చేశారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని ఆక్షేపించారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 'మహాపాపం' పేరిట వైకాపా హయాంలో లడ్డూ కల్తీ జరిగిన తీరును పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆయన వివరించారు. రాజకీయ వివాదం ఉండకూడదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సిట్ ఏర్పాటు చేశారు. సీబీఐ ఆధ్వర్యంలో విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపించింది. అందుకే ఏకసభ్య కమిటీ వేయాలని నిర్ణయించాం. లడ్డూ వ్యవహారంలో కాకుండా అనేక విషయాల్లో తప్పులు చేశారు. 2019-24 మధ్య మిగతా 2లో..


# కేరళ పేరు.. ఇక కేరళం

## కేంద్ర క్యాబినెట్ ఆమోదం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 (ఆర్ఎన్ఎ):** దేవుడి సొంత భూమిగా పిలిచే కేరళ పేరు మారనుంది. ఈ రాష్ట్రం పేరును అధికారికంగా కేరళంగా మార్చేదిశగా కీలక అడుగుపడింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిపాదనకు మంగళవారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పేరు మార్పుపై కేంద్రాన్ని అభ్యర్థిస్తూ ఇప్పటికే కేరళ అసెంబ్లీ పలుమార్లు తీర్మానాలు చేసిన సంగతి తెలిసిందే. అధికారిక రికార్డుల్లో రాష్ట్రం పేరును సవరించాలంటూ తీసుకువచ్చిన తీర్మానానికి ఇటీవల కేరళ శాసనసభ ఆమోదం తెలపగా.. తాజాగా కేంద్ర క్యాబినెట్ దానిని పరిగణనలోకి తీసుకుంది. ఈ ఏడాది కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కేరళ పేరు మార్పుపై తొలిసారి 2023లో రాష్ట్ర అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించింది. తమ రాష్ట్రం పేరును పూర్వం నుంచే మలయాళంలో 'కేరళం' అని పిలిచేవారని అప్పట్లో ముఖ్యమంత్రి పినరయి విజయన్ గుర్తు చేశారు. కానీ, ఇతర భాషల్లో మాత్రం కేరళ అని పిలుస్తున్నారని ఆయన తెలిపారు. కాగా.. ఈ విషయంలో విజయన్ ప్రభుత్వానికి భాజపా మద్దతు ఇచ్చింది. ఈ మేరకు ఇటీవల ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ సీఎంకు లేఖ రాశారు. దానికి ముఖ్యమంత్రి బదులిస్తూ.. "రాష్ట్రం అసలు పేరు కేరళం. కానీ బ్రిటిషర్లు తమ సౌకర్యం కోసం కేరళగా మార్చారు. వారు చేసిన మార్పులను రాష్ట్ర సంస్కృతికి అనుగుణంగా సరిదిద్దుతున్నాం" అని పేర్కొన్నారు. ఒక రాష్ట్రం పేరు మార్చాలంటే.. మార్పునకు ప్రతిపాదన చేస్తూ చేసిన తీర్మానానికి ఆ శాసనసభలో ఆమోదం లభించాలి. ఈ బిల్లును పార్లమెంట్ లో ప్రవేశపెట్టేముందు రాష్ట్రపతి సంబంధిత రాష్ట్ర శాసనసభ అభిప్రాయం తీసుకుంటారు. అయితే ఆ అభిప్రాయాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. తర్వాత రాష్ట్రపతి సిఫార్సు మేరకు పేరు మార్పు బిల్లును పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెడతారు. ఆ బిల్లు ఆమోదానికి సాధారణ మెజార్టీ సరిపోతుంది. తర్వాత రాష్ట్రపతి ఆమోదముద్రతో పేరు అధికారికంగా మారుతుంది. ఈ ప్రక్రియకు రాజ్యాంగ సవరణ అవసరం లేదు. ఆర్టికల్ 3 ప్రకారం సాధారణ చట్టం ద్వారానే చేయవచ్చు. అనంతరం రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో పేర్కొన్న అన్ని భాషల్లో మార్పులు చేస్తారు.

# దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 (ఆర్ఎన్ఎ):** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించే హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను దేశవ్యాప్తంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రత్యేక టీకా కార్యక్రమంలో భాగంగా 14ఏళ్ల వయసు పైబడిన బాలికలకు ఉచితంగా అందించనున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ఇందులో భాగంగా గార్డాసిల్ ఇంజెక్షన్ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ వ్యాక్సిన్ నాలుగు రకాల గర్భాశయ క్యాన్సర్‌లను నిరోధిస్తుంది. ఈ క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ టైప్ 16, 18 తోపాటు టైప్ 6, 11 రకాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుందని ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ఒక డోసు వ్యాక్సిన్ అందించడం వల్ల బాలికలకు సంబంధిత వైరస్‌ల నుంచి దీర్ఘకాల రక్షణ కల్పిస్తుందని దేశీయంగా, అంతర్జాతీయంగా జరిపిన శాస్త్రీయ పరిశోధనల్లో తేలింది. జాతీయ కార్యక్రమంలో భాగంగా దీన్ని స్వచ్ఛందంగా, ఉచితంగా అందివ్వనున్నారు. 15ఏళ్ల లోపు బాలికల కోసం ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న గార్డాసిల్-4 టీకాను రెండు డోసుల్లో తీసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో డోసు ధర. 3,927. అదే 15 ఏళ్ల వయసు పైబడిన బాలికలు మాత్రం మూడు డోసుల్లో తీసుకోవాలి. ఈవ్యాక్సిన్ 2006లో అందుబాటులోకి రాగా.. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 50 కోట్ల డోసులను పంపిణీ చేశారు. దీంతో అనేక దేశాల్లో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్లు గణనీయంగా తగ్గినట్లు అంచనా. 160 దేశాల్లో మిగతా 2లో..

# గుంటూరు ఛానల్ ఆధునీకరణకు 369 కోట్లు

❑ప్రభుత్వ పరిశీలనలో అంచనాలు

❑మండలిలో ప్రశ్నలకు మంత్రి నిమ్మల సమాధానం



**అమరావతి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గుంటూరు ఛానల్ ఆధునీకరణకు 369 కోట్ల రూపాయలతో అంచనాలు రూపొందించారని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ అంచనాల అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.370 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీఓ జారీ చేసిందన్నారు. అయితే.. 2021లో ఆ నిధులను రద్దుచేస్తూ మిగతా 2లో..

# భారత్‌ను అమెరికాకు అమ్మేశారు

## అమెరికాకు తలొగ్గిన ప్రధాని మోడీ: మరోమారు విమర్శలు గుప్పించిన రాహుల్



**భోపాల్, ఫిబ్రవరి 24 (ఆర్ఎన్ఎ):** భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విమర్శల దాడి చేశారు. మోదీ రాజీపడ్డారని, అమెరికా ఒత్తిడికి తలవంచారని ఆరోపించారు. భోపాల్‌లో మంగళవారంనాడు జరిగిన కాంగ్రెస్ కిసాన్ మహాచౌపాల్ కార్యక్రమంలో మాట్లాడుతూ, దేశాన్ని అమ్మేశారని, భారతీయుల డాటాను అమెరికా చేతిలో పెట్టారని మోదీని విమర్శించారు. 'వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తులతో ముడిపడిన కారణంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయింది. పార్లమెంటు ప్రసంగంలో కేవలం ఆర్మీ మాజీ చీఫ్ నవరణెళి గురించే నేను మాట్లాడలేదు. నా ప్రసంగం పూర్తికాగానే సొంత మంత్రులను కూడా సంప్రదించ కుండా మోదీ ట్రంప్‌తో మాట్లాడారు. మహిళా ఎంపీలు దాడి చేయాలనుకున్నారంటూ మిగతా 2లో..

# మావోయిస్ట్ పార్టీకి భారీ దెబ్బ


■డిజిపి ఎదుట లొంగిన ప్రధాన నేతలు

■లొంగిన వారిలో దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, జగన్, గంగన్న

■40 ఏళ్ల అజ్ఞాతానికి వీడ్కోలు పలికిన మావోలు

■వారిపై ఉన్న రివార్డును అందిస్తామన్న డిజిపి

■కేవలం ఇక 11 మంది మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని వెల్లడి



**హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణలో నలుగురు మావోయిస్టు అగ్రనేతలు మంగళవారం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో అధికారికంగా లొంగిపోయారు. వీరిలో పొలిట్ బ్యూరో సభ్యుడు (పీబీఎం) తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ అలియాస్ కుమ్మ దాదా, సెంట్రల్ కమిటీ సభ్యుడు (సీసీఎం) మల్లారాజి రెడ్డి అలియాస్ సంగ్రామ్ అలియాస్ రంగారం, మిగతా 2లో..

# కొండప్రాంతాల్లో రహదారులు అడవితల్లి బాట

## రూ.1,077 కోట్లతో ఈ కార్యక్రమం అమలు: అసెంబ్లీలో ప్రశ్నకు మంత్రి నాదెండ్ల సమాధానం



**అమరావతి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గిరిజన గ్రామాలు, కొండ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాల కోసం 'అడవితల్లి బాట' కార్యక్రమం చేపట్టినట్లు అసెంబ్లీలో మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రూ.1,077 కోట్లతో ఈ కార్యక్రమం అమలవుతోందని.. దీని ద్వారా సుమారు 4 వేల కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం జరుగుతోందని మంత్రి వివరించారు. ఏపీ అసెంబ్లీ సమావేశాలు తొమ్మిదో రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఈ సందర్భంగా అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ 'అడవితల్లి బాట' కార్యక్రమంపై ప్రశ్న లేవనెత్తారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సభలో లేకపోవడంతో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమాధానం ఇచ్చారు. మన్యం ప్రాంతంలో సరైన రోడ్లు లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడేవారని మంత్రి అన్నారు. అనారోగ్యానికి గురైనప్పుడు వైద్యం కోసం డోలీల ద్వారా రోగులను తరలించాల్సి వచ్చేదని చెప్పుకొచ్చారు. ఈ పరిస్థితిని మార్చాలనే ఉద్దేశంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 'అడవితల్లి బాట' కార్యక్రమాన్ని చేపట్టారని నాదెండ్ల మనోహర్ వివరించారు. అలాగే మిగతా 2లో..

**మొదటి పేజీ తరువాయిలు**

## మంత్రి నారా లోకేశ్ పనితీరుపై హైకోర్టు ప్రశంస

ప్రశంసించింది. కస్తూర్బా పాఠశాలల టీచర్ల జీతం పెంచుతామన్న ప్రకటనను అభినందించింది. పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేస్తామని మంత్రి ప్రకటన చేశారని వ్యాఖ్యానించింది. ప్రజా సమస్యలపై మంత్రి లోకేశ్ వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నారని తెలిపింది. హాస్టల్ విద్యార్థులను ఎలుకలు కరిచిన ఘటనపై వెంటనే స్పందించారని కితాబిచ్చింది. అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారంటూ హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది.

## కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులకు శిక్షపడాల్సిందే

తప్పుచేశారని తానెక్కడా చెప్పలేదని.. అప్పటి టీటీడీ పాలకమండలి తన బాధ్యత నిర్వహణలో విఫలమైందని విమర్శించారు. తాము ఏ ఒక్కరిపైనా ఆరోపణలు చేయడం లేదని.. జగన్ నియమించిన బోర్డు హయాంలోనే తప్పు జరిగిందని డిప్యూటీ సీఎం అన్నారు. నాటి టీటీడీ బోర్డు సభ్యులను మాజీ సీఎం జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారని ప్రశ్నించారు. 'దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవచ్చని జగన్ చెబితే సరిపోయేది.. వెనకేసుకొస్తున్నారంటే మీకూ భాగస్వామ్యం ఉన్నట్టే కదా?' అని అనుమానం వ్యక్తం చేశారు పవన్. అసలు నెయ్యిలో రసాయనాలు కలవలేదని వైసీపీ నేతలు చెప్పడమేంటని నిలదీశారు. ప్రసాదాన్ని అపవిత్రం చేసేందుకు కుట్ర జరిగిందని సిట్ తేల్చిందని చెప్పారు. నచ్చినవారికి కాంట్రాక్టులు ఇచ్చుకునేందుకు నిబంధనలు సడలించారని పవన్ ఆరోపించారు. రూ.20 కోట్ల లడ్డూలు రసాయనాల నెయ్యితో తయారైనట్టు తేలిందని, రసాయనాలతో తయారైన లక్ష లడ్డూలను అయోధ్యకు పంపారని ఈ సందర్భంగా పవన్ తెలిపారు. కల్తీ నెయ్యి కేసులో దోషులెవరైనా శిక్ష పడాల్సిందేనని స్పష్టం చేశారాయన. ఆ నెయ్యిలో.. ఏ రసాయనాలు ఉన్నాయో శ్రీవారికే తెలియాలన్నారు డిప్యూటీ సీఎం. నెయ్యిలో జంతు సంబంధ రసాయనాలు ఉన్నాయని ఎన్‌డీడీబీ రిపోర్టు ఇచ్చిందని.. అది అసలు నెయ్యే కాదని సీబీఐ సిట్ రిపోర్ట్ ఇచ్చిందని తెలిపారు. ఇది స్వామివారికి కాకుండా ఇతర ఏ మతానికి జరిగినా దేశం గగ్గోలు పెట్టేదని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్

ఇప్పటికే ఈ టీకా పంపిణీ కార్యక్రమం అమల్లో ఉండగా.. వీటిలో 90 దేశాలు సింగిల్ డోసులో అందిస్తున్నాయి. ప్రపంచంలో క్యాన్సర్ బాధితుల సంఖ్య పరంగా చైనా, అమెరికా తర్వాత భారత్ మూడోస్థానంలో ఉంది. 2040 నాటికి దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య ఏటా 20 లక్షలకు చేరే అవకాశం ఉందని అంచనా. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏటా 2 కోట్ల మంది క్యాన్సర్ బారిన పడుతుండగా.. వీరిలో 15 లక్షల మంది భారతీయులే ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

## గుంటూరు ఛానల్ ఆధునీకరణకు 369 కోట్లు

కొత్త అంచనాలు రూపొందించాలని నిర్ణయించినట్లు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.369 కోట్లతో పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. గుంటూరు ఛానల్ ఆధునీకరణపై ఏపీ శాసనమండలిలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ప్రశ్న లేవనెత్తారు. గుంటూరు ఛానల్ సంబంధిత కట్టలు దెబ్బతిన్నాయని తెలిపారు. మంగళగిరి పట్టణం నుంచి మురుగు నీరంతా ఈ ఛానల్‌లో కలుస్తోందని చెప్పారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఈ ఛానల్ మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గ పరిధిలో ఉండటంతో ఆయనే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హనుమంతరావు ప్రశ్నపై నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానిమస్తూ.. ఛానల్ పొడిగింపునకు రూ.285 కోట్లు విడుదల చేశామని మంత్రి నిమ్మల వెల్లడించారు. మంగళగిరిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గుంటూరు ఛానల్‌లో మురుగు కలవకుండా చూడాలని, దీనిపై మంత్రి నారా లోకేశ్ కూడా స్పందించి చర్యలు తీసుకోవాలని ఆలపాటి రాజా కోరారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. మొదటి దశ కింద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుచేయాలని నిర్ణయించామని తెలిపారు.

## భారత్‌ను అమెరికాకు అమ్మేశారు

అబద్ధాలు చెప్పారు. దానికి బదులుగా అమెరికాతో డీల్‌కు రెడీగా ఉన్నట్టు ఆయన సూటిగా చెప్పి ఉండవచ్చు. మోదీ కళ్లలో భయం స్పష్టంగా కనిపించింది' అని రాహుల్ అన్నారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో ఆదేశంతో ట్రేడ్ ఒప్పందాలను వదులుకోవాలని ఇతర దేశాలు నిర్ణయం తీసుకుంటే, మోదీ మాత్రం మౌనంగా ఉండిపోయారని రాహుల్ విమర్శించారు. 'ఇదే వేదిక నుంచి మోదీని సవాలు చేస్తున్నాను. డీల్‌పై అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున ఆ దేశంతో వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి. ట్రంప్ ఒత్తిడి కారణంగానే డీల్‌ను మోదీ రద్దు చేసుకున్నారు. భారతదేశం అత్యధిక జనాభా కలిగిన దేశం. డాటా కూడా పెద్దదే. కానీ మోదీ మన డాటాను అమెరికాకు ఇచ్చేశారు. ఆయన మీద ఒత్తిడి లేకపోతే ఆ పని చేసేవారు కాదు. తన ప్రతిష్ట, రాజకీయ భవిష్యత్తును కాపాడుకునేందుకు దేశాన్ని ఆయన అమ్మేశారు' అని మోదీపై రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు.

## కొండప్రాంతాల్లో రహదారులు అడవితల్లి బాట

ఒడిశా సరిహద్దులోని కొటియా గ్రామాల సమస్యను కొణతాల రామకృష్ణ సభలో ప్రస్తావించారు. ఈ గ్రామాల ప్రజలు రెండు రాష్ట్రాల్లో ఓటుహక్కును కలిగి ఉన్నారన్నారు. అయితే.. ఏపీ అధికారులు అక్కడికి వెళ్లకుండా ఒడిశా పోలీసులు అడ్డుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ సమస్యపై ప్రభుత్వం జోక్యం చేసుకుని త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు.

# వైకాపా హయాంలో కల్తీ నెయ్యితో 20 కోట్ల లడ్డూల తయారీ

(మొదటి పేజీ తరువాయి)

59.71లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగించారు. రూ.231.51 కోట్ల అక్రమాలు జరిగాయి. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను నీరుగార్చారు. ఒక పద్ధతి ప్రకారం లాలూచీ పడిన లూటీ అని స్పష్టంగా తేలింది. కల్తీ నెయ్యి అని నిర్ధారణ అయినా రిపోర్టును తొక్కిపెట్టారు. లడ్డూలో జంతుకొవ్వు కలిసిందని నేను సొంతంగా ఏమీ చెప్పలేదు. ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టునే చెప్పా. ఆ భగవంతుడే నాతో చెప్పించాడని చంద్రబాబు అన్నారు. గత వైసీపీ పాలనలో ఎన్నో విధ్వంసాలు చూశామని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దేవాలయాలపై దాడులు జరిగాయని ప్రశ్నిస్తే కేసులు పెట్టారన్నారు. రాముడి విగ్రహం ధ్వంసం చేశారని ప్రశ్నిస్తే తనపైనే దాడికి దిగారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రక్షాళన కోసం ఈవోను నియమించామని చెప్పారు. తన దృష్టికి వచ్చిన నేషనల్ డైయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ రిపోర్ట్ వివరాలు వెల్లడించానని తెలిపారు. శ్రీవారి లడ్డూ విషయంలోనే కాదు.. అనేక విషయాల్లో తప్పు చేశారంటూ వైసీపీ నేతలపై ఆయన మండిపడ్డారు. కుట్ర కోణాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. 59.71లక్షల కేజీల రసాయనాలతో కూడిన నెయ్యిని లడ్డూ తయారీలో వినియోగించారని వివరించారు. తద్వారా రూ. 234.51 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారంటూ వైసీపీ అగ్రనేతలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాబ్‌ల కళ్లుగప్పి నెయ్యి టెండర్లు దక్కించుకున్నారని విమర్శించారు. 2019 – 24 మధ్య రసాయనాలతో తయారు చేసిన నెయ్యితో 20 కోట్ల లడ్డూలు తయారు చేశారని పేర్కొన్నారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని సీఎం చంద్రబాబు గణాంకాలతో సహా వివరించారు. 2026 జనవరి 23న ఈ కల్తీ లడ్డూ వ్యవహారంలో సీబీఐ చార్జ్‌షీట్ వేసిందని గుర్తు చేశారు. అలిపిరి ఘటనలో శ్రీవేంకటేశ్వర స్వామి వారే తన ప్రాణాలను కాపాడారని సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. కల్తీ నెయ్యి వినియోగం లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సిట్ వేయాలని ఆలోచించినట్లు ఏపీ సీఎం తెలిపారు. సిట్ ఏర్పాటును వైసీపీ నేతలు సుప్రీంకోర్టులో సవాల్ చేశారని గుర్తు చేశారు. రాజకీయ వివాదం ఉండొద్దనే కేంద్ర, రాష్ట్ర అధికారులతో సిట్ ఏర్పాటు చేశామని వివరించారు. సీబీఐ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీం సూచించిందన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపిందని పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు రద్దు చేసిందని గుర్తు చేశారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని చెప్పినందుకే ఏకసభ్య కమిటీ అని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సీబీఐ రిపోర్టుతోపాటు ఫోరెన్సిక్ ఆధారాలను ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు. 2020 జనవరి, ఫిబ్రవరిలో టెండర్ల నిబంధనలు మార్చారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. నాణ్యతా ప్రమాణాలకు సైతం వారు తిలోదకాలిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022 మేలో భోలేబాబా సంస్థపై ఫిర్యాదు, విచారణకు ఆదేశించారన్నారు. 2022 ఆగస్టులో బీటా సిటోస్టిరాల్‌తో రసాయనాలు కలిశాయని నివేదిక వచ్చిందని చెప్పారు. అఈ÷ఖీఐ ల్యాబ్ రిపోర్ట్ వస్తే.. దానిని సైతం తొక్కిపెట్టారన్నారు. 2024 జులై 23న రిపోర్ట్ వచ్చిందని.. అందులోని అంశాలనే భగవంతుడు తనతో చెప్పించాడని సీఎం చంద్రబాబు తెలిపారు. జంతు కొవ్వు కలిసిందని తాను సొంతంగా చెప్పలేదని స్పష్టం చేశారు. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేయాలన్న నిబంధనను సైతం తొలగించారన్నారు. 2019 ఆగస్టులో టెండర్ నిబంధనల్లో సడలింపు చేశారని చెప్పారు. టర్నోవర్, పాల సేకరణ సామర్థ్యాన్ని కూడా తగ్గించారని పేర్కొన్నారు. 2020 జనవరిలో శ్రీ వైష్ణవి ప్లాంట్‌ను తనిఖీ చేసి.. ఉత్పత్తి సామర్థ్యం లేకపోయినా నెయ్యి సరఫరాకు అనుమతి ఇచ్చారన్నారు. కేజీకి రూ.329 చొప్పున భోలేబాబాకు నెయ్యి సరఫరా ఆర్డర్ ఇచ్చారని పేర్కొన్నారు. 2022 జూన్‌లో ఫతేపూర్‌లోని భోలేబాబా ఎ÷-లాంట్ తనిఖీ చేసి.. డబ్బులు ఇవ్వలేదని ఆ సంస్థపై అనర్హత వేటు వేశారని సీఎం చంద్రబాబు చెప్పారు. ఒక పథకం ప్రకారం తిరుమల పవిత్రతను దెబ్బ తీసేందుకు కుట్ర చేశారంటూ వైసీపీ నేతలపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. తిరుమలకు ఏ మతస్థులైనా రావొచ్చునని.. అన్యమతస్థులు శ్రీవారి దర్శనానికి వస్తే డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉందన్నారు. అధికారంలో ఉన్నామని నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించారని చెప్పారు. టెండర్ నిబంధనలను పూర్తిగా గాలికొదిలేశారన్నారు. నాటి టీటీడీ బోర్డు చైర్మన్ పీఏ చిన్నఅప్పన్న లంచం తీసుకుని దొరికిపోయారని చెప్పారు. ఇవన్నీ నాటి టీటీడీ చైర్మన్, బోర్డుకు తెలిసే జరిగాయని తెలిపారు. నాడు లడ్డూలో నాణ్యత తగ్గిపోయిందని చాలా ఆరోపణలు వచ్చాయని గుర్తు చేశారు. కల్తీ నెయ్యి తయారీకి ముఠాగా ఏర్పడ్డారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. నాటి టీటీడీ చైర్మన్ పీఏ చిన్నప్పన్న రూ.4.5 కోట్ల లంచం తీసుకున్నారన్నారు. నకిలీ సర్టిఫికెట్లతో టెండర్లు దక్కించుకుని రసాయనాల నెయ్యి సరఫరా చేశారని తెలిపారు. కల్తీ నెయ్యి తయారీకి వివిధ రకాల రసాయనాలు వినియోగించినట్టు దర్యాప్తులో తేలిందని సీఎం చంద్రబాబు వివరించారు.

# మావోయిస్ట్ పార్టీకి భారీ దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు (ఎస్‌సీఎం) నూనె నరసింహా రెడ్డి అలియాస్ గంగన్న అలియాస్ రన్నా దాదా ఉన్నారు. 40 ఏళ్లకు పైగా అజ్ఞాతంలో పనిచేసిన ఈ అగ్రనేతలు లొంగుబాటు నిర్ణయం తీసుకున్నారు. దీంతో మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పూర్తిగా నిర్వీర్యం అయినట్లు పోలీసులు ప్రకటించారు. ఈ నలుగురి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీలో అగ్రస్థాయి బాధ్యతలు నిర్వహించిన ఇద్దరు కీలక నేతలు జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన ఇంకా 11 మంది అజ్ఞాతంలో ఉన్నారని అన్నారు. వారు కూడా త్వరలో జనజీవనంలోకి రావాలని డీజీపీ కోరారు. ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి అడవుల్లో లేరని, బయట ఎక్కడో షెల్టర్ తీసుకున్నట్లు గుర్తించామన్నారు. తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీపై రూ.25 లక్షలు, మల్లారాజి రెడ్డిపై రూ.25 లక్షలు, బడే చొక్కారావు, నూనె నరసింహా రెడ్డిలపై రూ.20 లక్షల చొప్పున నగదు రివార్డు మొత్తాన్ని వారికి అందజేస్తామని ప్రకటించారు. 2019లో తెలంగాణలో మావోయిస్టులు రిక్రూట్‌మెంట్ జరిగిందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. 1982లో సీపీఐ (ఎంఎల్) పీపుల్స్ వార్‌లో చేరిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ దండకారణ్యంలో ఆయుధ దళ కార్యకలాపాలు నిర్వహించారు. 1984–89 మధ్య సిరోంచా, పెరిమిలి ప్రాంతాల్లో దళ కమాండర్‌గా పనిచేశారు. 1989లో డివిజనల్ కమిటీ సభ్యుడిగా, 2001లో సెంట్రల్ కమిటీ, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడిగా, 2017లో సీఎంసీ ఇన్‌ఛార్జ్‌గా, తర్వాత పొలిట్ బ్యూరో సభ్యుడిగా(పీబీఎం) ఎదిగారు. 1970లలో ఉద్యమంలోకి వచ్చిన మల్లారాజి రెడ్డి.. 1980లలో డివిజనల్ కమిటీ, రాష్ట్ర కమిటీ స్థాయికి ఎదిగారు. 1990లో సీసీఎంగా నియమితులయ్యారు. మహారాష్ట్ర, దండకారణ్య ప్రాంతాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2007లో పీబీ సభ్యత్వం, 2010–16 మధ్య ఛత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు. 1996లో ఆర్‌ఎస్‌యూ ద్వారా పార్టీలో చేరి 1999–2000లో ఏటూరునాగారం–మహాదేవపూర్ ప్రాంతాల్లో పార్టీ సభ్యుడిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ, ఇతర ప్రాంతీయ కమిటీలలో కీలక బాధ్యతలు చేపట్టారు. నూనె నరసింహా రెడ్డి కూడా రాష్ట్ర కమిటీ స్థాయిలో కీలక పాత్ర పోషించారు. మావోయిస్టు అగ్రనేతలు నలుగురు నేడు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయిన సంగతి తెలిసిందే. దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి(పొలిట్ బ్యూరో కమిటీ మెంబెర్).. మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్(సెంట్రమ్ కమిటీ మెంబెర్).. బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్(తెలంగాణ స్టేట్ సెక్రటరీ).. నూనె నరసింహారెడ్డి అలియాస్ గంగన్న సన్ను దాదా (స్టేట్ కమిటీ మెంబర్) పోలీసుల ముందు లొంగిపోయారు. పోలీసులు ఈ నలుగురినీ మంగళవారం మీడియా ముందుకు తీసుకువచ్చారు.

# మహిళలపై నేరాలు 4.4 శాతం తగ్గుదల

**20 నెలల్లో రాష్ట్రంలో నేరాలు 6.6 శాతం తగ్గాయి... ఆడబిడ్డల జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదు**

**మండలిలో చర్చ సందర్భంగా హోంమంత్రి అనిత వెల్లడి**

**అమరావతి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక మహిళలపై నేరాలు 4.4 శాతం తగ్గాయని, ఎవరైనా సరే ఆడబిడ్డల జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలపై శాసన మండలిలో చర్చ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడారు. సీఎం చంద్రబాబు తీసుకున్న చర్యల వల్లే 20 నెలల్లో రాష్ట్రంలో నేరాలు 6.6 శాతం తగ్గాయని, పోక్సో కేసులు 8 శాతం, మహిళలపై హత్యలు 45శాతం, సామూహిక అత్యాచారాలు 64 శాతం తగ్గాయని తెలిపారు. గతంలో కేసులు నమోదు కాలేదని, కానీ తాము ప్రతి కేసును నమోదు చేయడంతో నేరాల సంఖ్య తెలుస్తోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో శాంతి భద్రతలు లేవు కాబట్టే పెట్టుబడులు, పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోయాయని, బయటకు వచ్చిన మహిళ తిరిగి ఇంటికి వెళ్తుందో లేదో తెలియని దుస్థితి ఉండేదని అనిత విమర్శించారు. గత ప్రభుత్వం ప్లాన్ ఆఫ్ ఆక్షన్ ఇవ్వకపోవడం వల్ల రూ. 180 కోట్ల కేంద్ర నిధులు కోల్పోయామని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల టీడీపీ ఎమ్మెల్యే ఇంట్లో దొంగతనం కేసులో వైసీపీ గ్రామ సర్పంచ్ అరెస్టయ్యారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ప్రస్తుత ప్రభుత్వం రాజకీయాల కోసం వాడకోవడం లేదని, అందువల్లే రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 25 శాతం తగ్గాయని అనిత పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ నివారణకు ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తున్నామని, ఇప్పటివరకు 96,940 కేజీల గంజాయి సీజ్ చేశామని తెలిపారు. అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబోలేటరీ భవన నిర్మాణాన్ని జగన్ ఆపేశారని, తాము ఫోరెన్సిక్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రప్పా.. రప్పా.. నరుకుతాం' అని శాంతిభద్రతలకు భంగం కలిగిస్తూ రెచ్చగొట్టేలా మాట్లాడితే కేసు ÷ల్ చేశామని, వైసీపీ కార్యకర్తలు అసభ్యంగా మాట్లాడితే దాన్ని జగన్ సమర్థించడం దారుణమని అన్నారు. గీత దాటి రెచ్చగొడుతూ మాట్లాడినా చూస్తూ ఊరుకునేందుకు ఇక్కడ సీఎంగా ఉన్నది జగన్ కాదని, చంద్రబాబు అని అనిత పేర్కొన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ నేతలు చేసిన ఆరాచకాల ఫలితంగానే వారు 151 నుంచి 11 సీట్లకు దిగజారారని విమర్శించారు.

# విజయవాడలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడి

**పలు బూతుల్లో పాల శాంపిల్స్ సేకరణ... పాలలో కల్తీ చేస్తే మరణశిక్ష ఉంటుందని హెచ్చరిక**

**విజయవాడ, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజమండ్రి ఘటనతో విజయవాడలోని పాల బూత్ ల్లో ఫుడ్ సేఫ్టీ, పశు సంవర్ధక అధికారుల తనిఖీలు చేపట్టారు. శాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ, పశుసంవర్ధక శాఖ అధికారులు మాట్లాడుతూ.. విజయవాడలోని ఆరు పాల బూత్ లపై తనిఖీలు చేశాం.. ఆరు పాల బూత్ ల నుండి పాల శాంపిల్స్ సేకరించాము.. లేబొరేటరీ నుంచి మూడు రోజుల్లో రిజల్ట్స్ వస్తాయి.. పాలు కల్తీ చేసినట్టు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టిక్ కానీ, అల్యూమినియం డబ్బాలలో కానీ పాలను నిల్వ చేయవద్దు.. కేవలం స్టెయి÷-లనెస్ స్టీల్ క్యాన్లలో మాత్రమే పాలను నిల్వ చేయాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ కమిషనర్, కలెక్టర్ ఆదేశాలతో దాడులు నిర్వహిస్తున్నామని అధికారులు వెల్లడించారు. నిరంతరం దాడులు చేస్తాం.. సుప్రీంకోర్టు డైరెక్షన్స్ ప్రకారం పాలలో కల్తీ చేస్తే మరణశిక్ష కూడా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. పాల కల్తీ మామూలు నేరం కాదు, మర్డర్ చేసిన నిరం కంటే పెద్ద నేరంగా పరిగణించబడుతుంది అన్నారు. కృష్ణలంక సెంటర్, వన్ టైమ్స్, పంట కాలవ రోడ్డు, కరెన్సీ నగర్, ప్రసాదం పాడు ప్రాంతాలలో లూజ్ మిల్క్ అమ్మే వారిపై దాడులు నిర్వహించామన్నారు. ఇక, పాలు చాలా చిక్కగా ఉండటానికి పిండి పదార్థాలు కలుపుతున్నారని ఫుడ్ సేఫ్టీ అధికారులుతెలిపారు. పిండి పదార్థాలు కలిపారని అనుమానం వస్తే పాలలో అయోడిన్ వేస్తే పాలు మొత్తం కూడా నీలి రంగులోకి మారుతాయని పేర్కొన్నారు. పాలు చేతుల మధ్య నలిపితే ఉంటే పిండి బయటపడే అవకాశం ఉంటుంది.. పాలు చిక్కదనం, వెన్నేశాతం అధికంగా చూపించడం కోసం వెజిటేబుల్ ఆయిల్స్ కూడా కలుపుతారు.. వెజిటేబుల్స్ ఆయిల్ కలిపితే పాలు చాలా జిడ్డుగా ఉండే అవకాశం ఉంది.. పాలు టెస్ట్ చేసినప్పుడు ఏదైనా చేదుగా అనిపిస్తే ఖచ్చితంగా దాంట్లో పిండి పదార్థులు కలిసి ఉన్నట్లుగా భావించాలని వెల్లడించారు.

## పశు వైద్యశాల ఆధునీకరణకు చర్యలు

**అసెంబ్లీలో మంత్రి అచ్చన్నాయుడు**

**అమరావతి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పశు వైద్యశాలల్లో సౌకర్యాలు, ఉపకరణాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి అచ్చన్నాయుడు తెలిపారు. వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ఉచితంగా మందుల సరఫరా చేస్తున్నామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నోత్తరాలు సందర్భంగా రాష్ట్రంలోని పశు వైద్యశాలల్లో సౌకర్యాల కొరత, వైద్యుల నియామకాలపై పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు ప్రశ్నకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుసమాధానం ఇచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమైన శాఖలకు తాళాలు వేశారని.. అన్ని శాఖల్లో నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేశారని విమర్శించారు. ఇబ్బందులను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి వివరించారు. వెటర్నరీ ఆసుపత్రుల భవనాలు చాలా వరకు శిథిలావస్థకు చేరాయని చెప్పారు. 2014–19 మధ్య కాలంలో నాబార్డ్ నిధులతో 326 భవనాలు మంజూరు చేశామని.. వాటిలో కొన్ని భవనాల నిర్మాణాలను అప్పట్లో పూర్తి చేశామని గుర్తుచేశారు. అయితే.. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక కొత్త భవనాల నిర్మాణం నిలిపేసిందన్నారు. ఈ ఏడాది బ్జడెట్‌లో భవనాల మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. త్వరలోనే వైద్యులు, సిబ్బంది నియామకాలు చేపడతామని మంత్రి అచ్చెన్నాయుడు సభలో ప్రకటించారు.

## మృతి చెందిన సభ్యులకు అసెంబ్లీ సంతాపం

**అమరావతి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మంగళవారం శాసనసభలో పలువురు దివంగత నేతలకకు నివాళి అర్పించారు. ఇటీవల మరణించిన పలువురు మాజీ శాసనసభ్యులకు సభ సంతాపం తెలియజేసింది. గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్ రెడ్డి, విజయవాడ వెస్ట్ మాజీ ఎమ్మెల్యే ఆసిఫ్ పాషా, రైల్వే కోడూరు మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర ప్రసాద్, పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే గంటె సుమన్, శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండు అప్పల సూర్యనారాయణ, తాడేపల్లిగూడెం మాజీ ఎమ్మెల్యే ఈలి వరలక్ష్మి, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే రత్నాబాయి మృతి పట్ల సభ సంతాపం తెలిపింది. ప్రజా జీవితంలో వారు చేసిన సేవలను సభకు వివరించారు స్పీకర్ అయ్యన్నపాత్రుడు. మాజీ శాసనసభ్యుల మృతికి గౌరవసూచకంగా సభ్యులందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

## నెయ్యి సేకరణలో 2020లో నిబంధనలు మార్పు

**కల్తీ వ్యవహారంపై తొలుత తిరుపతి ఈస్ట్ పిఎస్‌లో కేసు**

**అసెంబ్లీలో కల్తీ లడ్డూ కేసు వివరాలు వెల్లడించిన ఆనం**

**అమరావతి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై తొలుత తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. అనంతరం సీనియర్ అధికారులతో ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటైందని చెప్పారు. ఆ తర్వాత సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సిట్‌ను పునర్ వ్యవస్థీకరించినట్లు వివరించారు. తిరుమల లడ్డూ కల్తీ అంశంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో మంత్రి మాట్లాడారు. 2014నుంచి ఈ–టెండర్ల ద్వారా అగ్‌మార్క్ స్పెషల్ ఆవు నెయ్యిని తితిదే సేకరిస్తోంది. కమిటీ సిఫార్సుల ఆధారంగా 2019లో టెండర్ నిబంధనలను బలోపేతం చేశారు. ఆ తర్వాత 2020లో సేకరణ నిబంధనలను మార్చారు. 5 నెలల వ్యవధిలోనే వాటిని సవరించినట్లు తేలింది. నిర్వహణ అనుభవాన్ని 3 ఏళ్ల నుంచి ఏడాదికి.. వార్షిక టర్నోవర్ అవసరాన్ని తగ్గించారు. ఆవు పాల కొవ్వు ఉత్పత్తి ప్రమాణాలను తగ్గించారు. తప్పనిసరి పాల సేకరణ నిబంధనను తొలగించారు. సమగ్ర అధ్యయనం, క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా సడలింపు చేశారు. అనుభవం లేని డెయిరీల ప్రవేశానికి ఇది దోహదపడినట్లు సిట్ గమనించింది. భోలేబాబా, వైష్ణవి సంస్థలతో పాటు ఇతర నిందితుల డెయిరీలు తక్కువ ధరను కోట్ చేయడం ప్రారంభించాయి. భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా పేర్కొన్నప్పటికీ బిడ్డర్ల సంఖ్య గణనీయంగా పెరగలేదు. కొన్ని నిర్దిష్ట సరఫరా దారులకు మాత్రమే అసమానంగా ప్రయోజనం చేకూర్చినట్లు ఈ సడలింపు ద్వారా తెలుస్తోంది'అని ఆనం రామనారాయణరెడ్డి వివరించారు.

## అధికారం అడ్డంపెట్టుకుని దోపిడీ

**నెయ్యి నిబంధనలు మార్చిందెవరు**

**అసెంబ్లీలో టిడిపి ఎమ్మెల్యే ధూళిపాళ్ల**

**అమరావతి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వైకాపా హయాంలో ఆ పార్టీ నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని సొంత కంపెనీలకు దోచిపెట్టారని తెదేపా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర విమర్శించారు. తిరుమల నెయ్యి సేకరణకు సంబంధించిన కఠిన నిబంధనలను మార్చిందెవరని ఆయన ప్రశ్నించారు. రోజుకు 4లక్షల లీటర్ల సామర్థ్యం నిబంధనను తీసేశారని.. రూ.250 కోట్ల టర్నోవర్‌ను రూ.150 కోట్లకు తీసుకొచ్చారని చెప్పారు. డెయిరీ అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి తీసుకొచ్చారన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో ధూళిపాళ్ల మాట్లాడారు. నిబంధనలు సడలింపు చేయడంతో తమకు కావాల్సిన ప్రైవేటు వ్యాపారులకు టెండర్లు ఇచ్చేందుకు పునాది పడింది. ఒక మహాపాపం, దోపిడీకి ఆనాడే తెరలేపారు. కల్తీ నెయ్యిని ఏటా సరఫరా చేశారు. నాటి ప్రభుత్వ పెద్దల భాగస్వామ్యం లేకపోతే తిరుమలలో ఐదేళ్లపాటు కల్తీ నెయ్యి సరఫరా సాగుతుందా? వైవీ సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా ఉన్నా ఎందుకు చర్యలు తీసుకోలేదు?' అని ఆయన ప్రశ్నించారు.

## రాష్ట్రంలో 11 ముఖ్య నగరాలలో 24×7 స్పీడ్ పోస్టు, పార్సెల్ బుకింగ్ సౌకర్యాలు

**అమరావతి, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారత తపాలా శాఖ ప్రజల సౌకర్యార్థం క్రింద తెలిపిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 11 ముఖ్య నగరాలలో 24×7 స్పీడ్ పోస్టు మరియు పార్సెల్ బుకింగ్ సౌకర్యాలను ప్రారంభించినట్లు తెలియజేస్తోంది. 1. విశాఖపట్నం, 2.విజయవాడ, 3. గుంటూరు, 4. నెల్లూరు, 5. కర్నూలు, 6. రాజమండ్రి, 7. తిరుపతి, 8. కడప, 9. అనంతపురం, 10. ఒంగోలు, 11. గుంతకల్. పైన పేర్కొన్న 11 నగరాలకే కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇతర 242 ప్రధాన పట్టణ తపాలా కార్యాలయాలలో కూడా ప్రజల సౌకర్యార్థం సాధారణ పని వేళలను 1 నుండి 2 గంటల వరకు పొడిగించడం జరిగింది. దీని వల్ల కస్టమర్ల రద్దీ తగ్గి, సేవల నాణ్యత మరింత మెరుగుపడనుంది. ప్రజలు మరియు వ్యాపార సంస్థలు, పై పేర్కొన్న 11 నగరాలలో అందుబాటులో ఉన్న 24ఐ7 బుకింగ్ సౌకర్యాలను అలాగే ఇతర 242 తపాలా కార్యాలయాలలో పొడిగించిన పని వేళలను తమ సౌకర్యానుసారం వినియోగించుకోవాలని కోరడమైనది.

## పులివెందులకు చేరుకున్న జగన్

**ఘనంగా స్వాగతించిన పార్టీ నేతలు**

**పులివెందుల, ఫిబ్రవరి 24 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల చేరుకున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం, జగన్ పులివెందులకు బయల్దేరి వెళ్లారు. ఆయన ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని సమస్యలు తెలుసుకో నున్నారు. పులివెందులలోని భాకరాపురం క్యాంప్ ఆఫీస్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలో బస చేస్తారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు పులివెందుల నివాసం నుంచి బయలుదేరి వేంపల్లి మండలం నందిపల్లి చేరుకుంటారు.

## నేటి మనదేశం సంపాదకీయం


# ప్రజల పాలిట పాలకూట విషం

కల్తీకి కాదేదీ అర్హం అన్న రీతిలో... ఆహారా పదార్థాల కల్తీ విపరీతం అయ్యింది. అడపాదడపా దాడుల్లో కల్తీలు బయటపడుతున్నా కఠిన చర్యలు కనిపించడం లేదు. కల్తీ చేస్తున్న దగుల్బాజీల్లో భయం కనిపించడం లేదు. కల్తీ కల్లుకు బలవుతున్నారు. కల్తీ మద్యానికి బలవుతున్నారు. ఫుడ్ పాయిజనింగ్‌కు బలవుతున్నారు. చివరకు పాలు కూడా కల్తీ చేస్తున్నారు. యూరియా లాంటివి కలిపి కృత్రిమ పాలతో ప్రజల ప్రాణాలు తోడేస్తున్నారు. నిత్యం తాగే పాలను సైతంకల్తీ చేస్తున్న ఘటన వెలుగులోకి రావడం దారుణం. కల్తీ పాల కారణంగా ఇప్పటికే ఐదుగురు మృత్యువాత పడ్డారు. మరికొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి ఐదుగురు మరణించడం బాధాకరం. స్వచ్ఛతకు మారుపేరుగా పాలను పేర్కొంటారు. అటువంటి పాలను అమితమైన లాభార్జన కోసం కాలకూట విషం కావించడం అమానవీయం. ఒకప్పుడు పాలల్లో నీళ్లు కలపడాన్ని పెద్ద నేరంగా పరిగణించేవారు. ఇప్పుడు పాలంటే హడలెత్తే స్థితికి కల్తీ దందా చేరుకోవడం ఆందోళన కలిగిస్తుంది. పాలు ప్రజలకు నిత్యావసర వస్తువు. పసికందుల దగ్గర నుంచి వృద్ధుల వరకు పాలే జీవనాధారం. పాలు తాగితే చాలా వరకు మన శరీరానికి కావాల్సిన సంపూర్ణ పోషకాలు సమకూరుతాయన్నది ఆరోగ్య నిపుణుల మాట. అటువంటి పాల వ్యాపారంపై ప్రభుత్వ నియంత్రణ అంతంత మాత్రమే. ఎవరైనా డెయిరీ పెట్టవచ్చు. పాలు సరఫరా చేయవచ్చు. అందులో ఏం కలుస్తున్నాయో తెలియడం లేదు. నేరుగా గేదె పాలు పోస్తున్నారన్న నమ్మకంతో ప్రజలు డబ్బాల్లో వచ్చే పాలను ఆశ్రయిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు అడ్రస్ లేకుండా పోయారు. వాటిపై పర్యవేక్షణ ఎవరిదన్న విషయం తెలియదు. కాలం చెల్లిన, నాసిరకం, కల్తీ పాలను గుర్తించే వ్యవస్థ అసలు ఉందా అన్నదే అనుమానం. గతంలో రైతులు తమకు తాముగా నిర్వహించుకునే సహకార వ్యవస్థ బలంగా ఉన్నప్పుడు పాల కల్తీ ఉండేది కాదు. ఎప్పుడైతే ప్రైవేటు డెయిరీలు పుట్టగొడుల్లా పుట్టుకొచ్చాయో అప్పటి నుంచి కల్తీ విచ్చలవిడైందన్న ఆరోపణలు బాగా ముందుకొచ్చాయి. పాడి-పంట.. గ్రామీణ ప్రాంతాల్లో రైతుతో విడదీయరాని బంధం. గ్రామీణ మహిళలే పాడిని నిర్వహిస్తారు. కానీ కష్టపడి పాలను ఉత్పత్తి చేసిన రైతుకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. వారి వద్ద నుంచి పాలను సేకరించిన ప్రైవేటు డెయిరీలకు మాత్రం లాభాల పంట పండుతుంది. రోజూ ఉత్పత్తవుతున్న పాలల్లో ప్రైవేటు, సహకారం రెండూ కలిపినా కూడా సంఘటితరంగం కిందికొచ్చేవి సగం కూడా లేదన్నది ప్రభుత్వ అంచనా. ప్రభుత్వం దశలవారీగా సహకార రంగాన్ని నిర్వీర్యం చేయడంతో ప్రైవేటు ఆధిపత్యం అంతకంత కూ పెరుగుతోంది. డెయిరీల మధ్య అనారోగ్య పోటీ నెలకొంది. డెయిరీ ప్రైవేటీకరణ కాస్తా కార్పొరేటీకరణ బాట పట్టింది. ఎప్పుడైతే పరిస్థితి మారిందో చిన్నా చితకా డెయిరీలు సైతం లాభాల కోసం అడ్డదారులు తొక్కుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నాయి. రాష్ట్రంలో పాడిపశువుల సంఖ్యపై అనుమానా లున్నాయి. ప్రజల ఆరోగ్యాలను హరించే సింథటిక్ పాలు, యూరియా వంటి రసాయనాలతో తయారు చేసిన పాలు మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నాయన్న ఫిర్యాదులొస్తున్నాయి. పాల వ్యాపారులు ఏకంగా కృత్రిమ పాలను ఉత్పత్తి చేస్తున్నట్లు కనిపిస్తుంది. దీనికితోడు తనిఖీ బాధ్యతను ఆయా సంస్థలకే వదిలేసినట్లు కనిపిస్తుంది. పాలతో సహా యావత్ ఫుడ్ సేఫ్టీ బాధ్యత ప్రభుత్వానిదే అయినా ఎక్కడా అజమాయిషీ కనిపించడం లేదు. . అందుకు పటిష్టమైన వ్యవస్థ అవసరం. లేదంటే ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందనడానికి రాజయమండ్రి ఘటనే నిదర్శనం. రాజమహేంద్రవరం కేసులకు సంబంధించిన ఇప్పటికీ ఇద్దరు వెంటిలేటర్‌పై ఉండగా, ఎనిమిది మంది తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఒకే వ్యక్తి నుంచి పాలు కొనుగోలు చేసిన వారిలో ఈ వ్యాధి ముదరి ఆస్పత్రి పాలయ్యారు. అనూరియా అంటే మూత్ర విసర్జన ఆగిపోవడం వంటి జబ్బుతో పలువురు ఆస్పత్రిలో చేరారు. రాజమండ్రి నగర శివారుకు చెందిన డజను మంది అనూరియా లక్షణాలతో ఆదివారం ఒకేసారి ఆస్పత్రులల్లో చేరడంతో కలకలం లేచింది. పరిస్థితి డయాలసిస్, కిడ్నీల ఫెయిల్యూర్ వరకు వెళ్లడంతో స్థానిక ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అనారోగ్యం పాలైన వారు వృద్ధులు, చిన్నారులే కావడం పెద్ద విషాదం. అప్రమత్తమైన అధికార యంత్రాంగం కారణాలను అన్వేషించే పనిలో పడింది. కోరుకొండ మండలం పర్సాపురం గ్రామానికి చెందిన వరలక్ష్మి డెయిరీ నుంచి సరఫరా అయిన కల్తీ పాలే పలువురి అస్వస్థతకు మూలమని ప్రాథమికంగా గుర్తించారు. డెయిరీ నిర్వాహకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని కూపీ లాగుతున్నారు. కల్తీ పాల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించడం తో పాటు బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని పేర్కొంది. మృతుల కుటుంబాలకు రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారి పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తానని పేర్కొంది. ఈ మేరకు శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, శాసన మండలిలో హోం మంత్రి అనిత ప్రకటనలు చేశారు. దీనిని ఇంతటితోనే విదిలేస్తే సరిపోదు. పాల సరఫరాచేస్తున్న వారిపై నిఘా పెట్టాలి. కల్తీ పాల వ్యవహారాన్ని గుర్తించాలి. నిజానికి పాడిగేదెలు ఎన్ని ఉన్నాయి..ఎక్కడెక్కడ నుంచి పాలు వస్తున్నాయో వివరాలను ప్రభుత్వం వద్ద నమోదు చేసుకునేలా చేస్తే మంచిది. పాల కల్తీ జనాన్ని కలవర పరుస్తోంది. కాసుల కక్కుర్తితో కొందరు ఈ పాపానికి ఒడిగడుతున్నారు. అనుమతి లేని కేంద్రాలను నడుపుతూ జనం ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. పటిష్ఠ తనిఖీలు, కఠిన శిక్షలు లేకపోవడంతో పాల కల్తీకి అడ్డుకట్ట పడడం లేదు. జిల్లాల్లో అవసరాలకు, ఉత్పత్తికి భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్యాకేజ్డ్ పాల ద్వారా కొంత అవసరాలు తీరుతుండగా.. మిగతా పాలు ఎక్కడివనే తీవ్ర అనుమానాలు రేకెత్తుతున్నాయి. వినియోగానికి అనుగుణంగా ఉత్పత్తి లేకపోవడంతో కొందరు కాసుల కక్కుర్తితో కల్తీకి పాల్పడుతున్నారు. రెండు లీటర్ల పాలల్లో యూరియా, బియ్యం పిండి, సోడా వంటివి కలిపి 5 నుంచి 6 లీటర్లుగా తయారు చేస్తున్నారు. ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లపై నిషేధమున్నా.. పాల దిగుబడి పెంపునకు రహస్యంగా తెచ్చి గేదెలకు ఇస్తున్నారు. గ్లూకోజ్, సోడియం, హైడ్రాక్సైడ్, గంజి పొడరు, జంతువుల కొవ్వు కొన్ని రకాల పాల పొడులను పాలలో కలిపేస్తున్నారు. రసాయనాలతో వ్యాధుల ముప్పు: కల్తీ పాలతో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. చిక్కదనం కోసం వాడే యూరియా మూత్రపిండాలను దెబ్బతీస్తుంది. నిల్వ కోసం కలిపే వాడే ఫార్మలిన్ అనే రసాయనంతో జీర్ణకోశ వ్యవస్థ అస్తవ్యస్తమవుతుంది. రసాయనాలతో ఉదర, కాలేయ సంబంధిత సమస్యలొస్తాయి.

# ఎంతకాలం ఉంటానో తెలియదు.. అయినా వెనకడుగు వేసే ప్రసక్తి లేదు

### నన్ను చంపడానికి అందరూ కాచుక్కూచున్నారు... అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య

**వాషింగ్టన్,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** నేను ఎంతకాలం ఉంటానో తెలియట్లేదు' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇటీవల ఫ్లోరిడాలోని తన నివాసంలోకి ఓ సాయుధ దుండగుడు చొరబడిన ఘటనపై స్పందిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మార్-ఎ-లాగో రిసార్ట్ లోకి తుపాకీతో చొరబడేందుకు ప్రయత్నించిన ఆగంతుకుడిని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్చి చంపిన ఘటనపై డొనాల్డ్ ట్రంప్ తొలిసారి స్పందించారు. ఈ భద్రతా లోపంపై ఆయన కాస్త ఆందోళన, మరికాస్త వ్యంగ్యంగా మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. వైట్ హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్.. నేను ఇంకా ఎంతకాలం ఇక్కడ ఉంటానో నాకు తెలియదు. నా కోసం తుపాకులు పట్టుకుని ఎంతమంది వేచి చూస్తున్నారో చూశారుగా ?' అని వ్యాఖ్యానించారు. గొప్ప నాయకులకే ఇలాంటి ముప్పు ఉంటుందని, అబ్రహం లింకన్, కెన్నడీ వంటి 'ప్రభావశీల' అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని చెప్పారు. బహుశా నేను కొంచెం తక్కువ ప్రభావశీల నాయకుడిగా ఉంటే బాగుండేదేమో.. కాసేపు సాధారణ అధ్యక్షుడిలా ఉందాం అని చమత్కరించారు. ఫిబ్రవరి 22 తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో ఆస్టిన్ టక్కర్ మార్టిన్ (21) అనే యువకుడు షాట్ గన్,



ఇంధనం క్యాన్‌తో మార్-ఎ-లాగో ప్రహరీని దాటేందుకు ప్రయత్నించాడు. భద్రతా దళాలు హెచ్చరించినప్పటికీ, అతడు లొంగకుండా తుపాకీని ఎక్కుపెట్టడంతో సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మార్టిన్ అక్కడికక్కడే మరణించాడు. ఆ సమయంలో ట్రంప్ దంపతులు వైట్ హౌస్‌లో ఉన్నారు. గతంలో కూడా ట్రంప్‌పై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగిన విషయం తెలిసిందే. తాజా ఘటనలో చనిపోయిన యువకుడు ఎప్ స్టీన్ ఫైల్స్ విడుదలకు సంబంధించి ప్రభుత్వంపై అసహనంతో ఉన్నట్లు కొన్ని టెక్ట్స్ మెసేజ్‌ల ద్వారా వెల్లడయ్యింది. తనపై జరుగుతోన్న వరుస హత్యాయత్నాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. తనను హత్య చేయడానికి చాలా మంది ప్రయత్నాలు చేస్తున్నారని.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే తాను ఎంత కాలం ఉంటానో కూడా తెలియట్లేదన్నారు. ఇటువంటి షూటర్లు సాధారణ అధ్యక్షుల జోలికి వెళ్లరని.. కేవలం అసాధారణ విజయాలు సాధించే అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని అన్నారు. ఇలాంటి ఎన్ని బెదిరింపులకు పాల్పడినా.. తాను తీసుకునే నిర్ణయాలపై ఏ మాత్రం వెనక్కి తగ్గబోనన్నారు. 2024 జులైలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయనపై ఓ వ్యక్తి కాల్పులు జరిపాడు. ఆ ఘటనలో ట్రంప్ చెవి భాగం నుంచి తూటా దూసుకెళ్లింది. ఆ తర్వాత ఓసారి ట్రంప్ పామ్ బీచ్ గోల్ఫ్ కోర్స్‌లో రైఫిల్‌తో అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తినీ పోలీసులు అరెస్టు చేశారు.

# ఎఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ నిరసనలు

### యూత్ కాంగ్రెస్ చిల్లర చేష్టలపై విమర్శలు... యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు చిబ్ అరెస్ట్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** ఢిల్లీలోని భారత్ మండపంలో ఇటీవల జరిగిన ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన 'షర్ట్‌లెస్' నిరసనకు సంబంధించి.. యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నిరసన గురువారం సమ్మిట్ ఎగ్జిబిషన్ హాల్‌లో జరిగిన సంగతి తెలిసిందే. ఐదుగురు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు షర్టులు విప్పేసి, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా సందేశాలు రాసిన టీ-షర్టులు పట్టుకొని నిరసన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీపై ఆరోపణలు గుప్పించారు. సెక్యూరిటీ సిబ్బంది.. వారిని వెంటనే బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటన తర్వాత ఏడుగురు కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.మంగళవారం ఢిల్లీ పోలీసులు ఉదయ్ భానును అరెస్టు చేశారు. ఆయన్ను తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో 15 గంటలకు పైగా విచారించిన తర్వాత అరెస్ట్ చేశారని సమాచారం. దీంతో ఈ కేసులో మొత్తం అరెస్ట్‌ల సంఖ్య ఎనిమిదికి చేరింది. పోలీసులు ఆయనపై.. కుట్రలో పాత్ర ఉందని, విచారణకు సహకరించలేదని, తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. త్వరలోనే కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. భూపేశ్ బాఘేల్ వంటి సీనియర్ నేతలు ఈ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. 'ప్రజాస్వామ్యంలో యువత ప్రశ్నలు వేయడం, నిరసన తెలపడం నేరం కాదు,అది ప్రజాస్వామ్య ఆయుధం' అని బాఘేల్ అన్నారు. ఈ అరెస్ట్‌లను అరాచక, అన్యాయ చర్యలుగా పేర్కొన్నారు. నిరసన శాంతియుతంగా జరిగిందని, యువత బాధలను బయటపెట్టడమే ఉద్దేశ్యమని కాంగ్రెస్ వర్గాలు వాదిస్తున్నాయి. బీజేపీ నేత ప్రదీప్ భండారి ఈ నిరసనను 'నేక్డ్ యాంటీ-ఇండియా ప్రొటెస్ట్' అని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను యాంటీ-ఇండియా, యాంటీ-గ్రోత్ పార్టీగా విమర్శించారు. 'యువతకు కాంగ్రెస్ 'నంగి' పార్టీగా కనిపిస్తోంది' అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో జరుగుతున్న చర్చలు, ప్రదర్శనలకు సంబంధించింది. దీనిని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈవెంట్‌గా చూస్తున్నారు. అయితే.. ఈ నిరసన వెనుక రాజకీయ కుట్ర కోణం ఉందని, దేశం పరువు మంటగలపాలన్నది వీరి పన్నాగమని బీజేపీ వర్గాలు మండిపడు తున్నాయి.

# పోలవరం ప్రాంతంలో మరోమారు పులికలకలం

### అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన అటవీ అధికారులు



**రాజమండ్రి, ఫిబ్రవరి 24 (ఆర్ఎన్ఎ):** పోలవరం జిల్లాలో మరోసారి పులి సంచారం కలకలం రేపుతోంది. రంపచోడవరం మండలం అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇదే పులి సంచరించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఈ పులిని అటవీ అధికారులు ఎంతో చాకచక్యంగా బంధించి విశాఖపట్నం జూకు తరలించారు. అక్కడ చికిత్స అందించిన తర్వాత, ప్రత్యేక కమిటీ నిర్ణయం మేరకు పాపికొండలు అభయారణ్యంలో వదిలిపెట్టి.. ఆ వీడియోలను మీడియాకు విడుదల చేశారు. అయితే, ఇదే పులి గత రెండు రోజులుగా మారేడుమిల్లి మండలం అటవీ ప్రాంతంలో కనిపించింది. కాకవాడ, దారగూడెం, నూరుపూడి, సీమగండి, రామన్నవలస, తుర్రూరు, దేవరపల్లి, సున్నంపాడు గ్రామాల సరిహద్దుల్లో సంచరించినట్లు సమాచారం. ప్రస్తుతం రంపచోడవరం మండలంలోని గెద్దాడ, చిలకమామిడి, బూసిగూడెం అటవీ ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. పులి సంచారంతో అటవీశాఖ నిఘా పెంచింది. పులి కదలికలపై నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. పులి సంచారం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి సమయంలో ఒంటరిగా బయటకు వెళ్లవద్దని అటవీ అధికారులు హెచ్చరించారు.

# వికసిత బెంగాల్ బాధ్యత నాది

### ఆందోళన కలిగించేలా బెంగాల్లో చొరబాట్లు... బంగారు బంగ్లా కలలు సాకారం చేసుకుందాం.. బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరుగనున్న వేళ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బెంగాల్ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొద్ది నెలరోజుల్లో బెంగాల్ భవితను నిర్ణయించే కీలక ఎన్నికలు జరుగ నున్నాయని, భావితరాల భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికల్లో ప్రజలు వివేకవంతమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. బంగారు బంగ్లా కలల సాకారానికి తాను భరోసా ఇస్తున్నానని అన్నారు. జై మహాకాళి' అంటూ ప్రధాని తన లేఖను ప్రారంభించారు. 'మరి కొద్ది నెలల్లోనే బెంగాల్ భవిష్యత్తు నిర్ణయం కోబోతోంది. మీరు తీసుకునే తెలివైన నిర్ణయం పైనే భావితరాల భవిష్యత్తు, దిశానిర్దేశర ఆధారపడి ఉంటుంది. సోనార్ బంగ్లా కోసం యువకులు, పెద్దలు, మహిళలు కన్న కలలు కల్లలుగా మిగిలిపోతున్న పరిస్థితి ఇవాళ ఉంది. వారి బాధలు నన్ను కలిచివేస్తున్నాయి. ఇందుకోసం హృదయపూర్వకంగా ఒక తీర్మానం చేసుకున్నాను. వికసత్ బంగ్లా సాధనకు నిర్ణయం తీసుకున్నాను' అని ఆ లేఖలో మోదీ పేర్కొన్నారు. గత 11 ఏళ్లుగా దేశ ప్రజల ఆశీస్సుల బలంతో ప్రజాసంక్షేమానికి, దేశ సర్వతోముఖాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం పాటుపడిందని, రైతుల సంక్షేమం నుంచి యవత కలల సాకారం, మహిళా సాధికారత వరకూ కృషి చేసిందని చెప్పారు. ప్రభుత్వ విధానాల వల్ల సాధించిన సానుకూల ఫలితాలను ఇవాళ ప్రజలు చూస్తున్నారని అన్నారు. బెంగాల్ అభివృద్ధి విషయంలో మమతాబెనర్జీ ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తోందని మోదీ ఆ లేఖలో విమర్శించారు. అయినప్పటికీ ప్రజాసంక్షేమానికి కట్టుబడి కేంద్రం ముందుకు వెళ్తోందన్నారు. 'జన్-ధన్ యోజన'తో పశ్చిమబెంగాల్‌లోని సుమారు 5 లక్షల మందికి బ్యాంకు అకౌంట్లు తెరిచామని, స్వచ్ఛభారత్ అభియాన్ కింద 85 లక్షల టాయిలెట్లను రాష్ట్రంలో నిర్మించామని చెప్పారు. చిన్న వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రూ.2.82 లక్షల కోట్లు రుణాలిచ్చామని, 56 లక్షల మంది సీనియర్ సిటిజన్లకు అటల్ పెన్షన్ యోజన కింద లబ్ధి చేకూర్చామని, ఉజ్వల్ యోజన కింద కోటికి పైగా ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. 'కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా 52 లక్షల మంది రైతులకు నేరుగా ఆర్థిక సాయం అందించామని వివరించారు.'నేతాజీ సుభాష్ చంద్రబోస్ పుట్టిన గడ్డలో ఇవాళ అక్రమ చొరబాట్లు, మహిళలపై హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రబీంద్రనాథ్ఠాగూర్ కలలుకన్న సోనార్ బంగ్లా ప్రమాదంలో పడింది. ఇవాళ బెంగాల్ పూర్వ గౌరవాన్ని పునరుద్ధరించాలి. మార్పు అనివార్యం. బెంగాల్ అభివృద్ధి ప్రయాణంలో అంతా కలిసిరావాలి. 2026లో వికసిత్ వెస్ట్ బెంగాల్ కోసం ప్రతినబూనుదాం' అని మోదీ ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

# నల్లగొండలో డెస్క్ జర్నలిస్టుల ఆందోళన

**నల్లగొండ,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** అక్రిడిటేషన్ల విషయంలో డెస్క్ జర్నలిస్టులకు చాలా అన్యాయం జరుగుతోందని, అక్రిడిటేషన్ కార్డుల సంఖ్య పెంచి అర్హులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డెస్క్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (డీజేఎఫ్‌టీ) ఆధ్వర్యంలో సోమవారం వివిధ పత్రికల డెస్క్ జర్నలిస్టులు సోమవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అక్రిడిటేషన్ల సంఖ్య భారీగా తగ్గించారని, గతంలో ప్రతి జిల్లాకు ఐదుగురికి, ఎడిషన్ సెంటర్‌లో 8 మంది డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వగా ప్రస్తుతం కేవలం ఎడిషన్ సెంటర్‌కు నాలుగు అక్రిడిటేషన్లు మాత్రమే ఇస్తామని నిబంధన పెట్టారని, ఈ నిబంధన వల్ల చాలామంది డెస్క్ జర్నలిస్టులు అక్రిడిటేషన్లకు దూరం అవుతున్నారని మండిపడ్డారు. డెస్క్ జర్నలిస్టులు ఎడిషన్ కేంద్రాల్లోనే పనిచేసినా ఏ జిల్లాకు ఆ జిల్లా డెస్క్‌లు వేరుగా ఉంటాయని ప్రతి జిల్లాకు ఒక ఇన్‌చార్జితో పాటు నలుగురు సబ్ ఎడిటర్లు ఉంటారన్నారు. జీఓ ప్రకారం ఎడిషన్‌కు నాలుగు కార్డులే ఇస్తే కనీసం ఆ జిల్లాల ఇన్‌చార్జిలకు కూడా వచ్చే పరిస్థితి లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రివేళల్లో పనిచేసే తాము తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నామని, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేనివాళ్లమని, కనీసం అక్రిడిటేషన్ కార్డు ఉంటే హెల్త్ కార్డు అయినా తమకు ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి డెస్క్ జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్లు వచ్చేలా చూడాలని కోరారు. ఈ ధర్నాకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ), టీయూడబ్ల్యూజే 143, టీడబ్ల్యూజేఎఫ్ సంఘాల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు.

# పర్యాటకంగా విశాఖలో పలు అభివృద్ధి పనులు

### రూ.8,650 కోట్ల పెట్టుబడులతో 50 ఒప్పందాలు... అసెంబ్లీలో మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడి

**అమరావతి,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో విశాఖ నగరం కీర్తి కిరీటంగా నిలుస్తుందని మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా విశాఖపట్నం దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్ వంశీ కృష్ణ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాల అభివృద్ధికి రూ.8,650 కోట్ల పెట్టుబడులతో 50 ఎంవోయూ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు మంత్రి తెలిపారు. హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో విశాఖను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ÷ఖ-ప్లేన్, క్రూజ్ సర్క్యూట్, హెలీ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మంత్రి దుర్గేశ్ చెప్పారు. విశాఖను అడ్వెంచర్ , యాంకర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ప్రసాద్ స్కీమ్ కింద సింహాచలం దేవస్థానానికి రూ.54.04 కోట్లు, స్వదేశీ దర్శన్ 2.0 కింద బొర్రా గుహల అభివృద్ధికి రూ.28.87 కోట్లు మంజూరు చేసి పనులు వేగవంతం చేశామని వివరించారు. రుషికొండ, తిమ్మాపురం, సాగర్ నగర్ బీచ్, గోస్తనీ



బ్యాక్ వాటర్స్‌లో స్కూబా డైవింగ్, పారా మోటరింగ్ వంటి 10 రకాల జలక్రీడలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడంతో మరింత ఊతం వచ్చిందని మంత్రి అన్నారు.

క్యారవాన్ పాలసీలో భాగంగా అన్ని ప్రాంతాల్లో క్యారవాన్ పార్కుల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. విశాఖలో 'హాప్-ఆన్, హాప్-ఆఫ్ డబుల్ డెక్కర్ బస్సులు' సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. హోమ్ స్టే పాలసీ, బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ విధానంతో 490 హోమ్ స్టేలు ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. 'సీఆర్‌జెడ్ 19' అమల్లోకి వస్తే పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణాలకు ఉన్న అడ్డంకులు తొలగిపోతాయన్నారు. 2019-24 కాలంలో కుదేలైన పర్యాటక రంగాన్ని కూటమి ప్రభుత్వం పట్టాలెక్కించిందని ఆయన వివరించారు. నూతన పర్యాటక పాలసీ 2024-29తో విస్తృతంగా పెట్టుబడులు వచ్చాయన్నారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలను పర్యాటక హబ్‌లుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి దుర్గేశ్ స్పష్టం చేశారు.

# బీట్ రూట్‌లో ఆరోగ్య ప్రయోజనాలతో పాటు దుష్ప్రభావాలు కూడా ఉన్నాయి!

బీట్‌రూట్ రసం రక్తం వలె ఎర్రగా ఉంటుంది అనే కారణంతో చాలా మందికి ఈ అద్భుతమైన కూరగాయలు నచ్చవు. కానీ దాని పోషకాల ప్రయోజనాల విషయానికి వస్తే, ఎప్పటి నుండో దీన్ని సలాడ్లలో ఎక్కువగా ఉపయోగించబడుతోంది. అయితే, దీన్ని ముట్టుకుంటే చెయ్యి ఎర్రగా ఇష్టపడని వారు రసం తాగే అవకాశం ఉంది. బీట్రూటీని వర్ణద్రవ్యం అంటారు. అదనంగా, బీట్‌రూట్‌లోని ఇతర పోషకాలు శరీరం సులభంగా గ్రహించబడతాయి. బీట్‌రూట్ రసం రక్తపోటును తగ్గిస్తుందని అధ్యయనాలు కనుగొన్నాయి. బీట్‌రూట్ జ్యూస్ వినియోగం వల్ల ఇంకా చాలా ప్రయోజనాలు ఉన్నాయి. దీని రోగ నిరోధక లక్షణాలు క్యాన్సర్ నుండి రక్షణ కల్పిస్తాయి మరియు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి బీట్ రూట్ సహాయపడతాయి. వీటిలో ముఖ్యమైనవి నేటి వ్యాసంలో వివరించబడ్డాయి.

**రండి చూద్దాం:**

గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది బీట్‌రూట్ రసం తీసుకోవడం వల్ల శరీరానికి మంచి నైట్రేట్లు లభిస్తాయి. ఈ నైట్రేట్లు రక్త నాళాలను సడలించి రక్త ప్రవాహాన్ని సులభతరం చేస్తాయి మరియు రక్తపోటు నుండి ఉపశమనం పొందుతాయి. ఇది గుండెపై భారాన్ని తగ్గిస్తుంది మరియు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బీట్‌రూట్ రసం తీసుకోవడం మన శరీరాన్ని సానుభూతిపరుడైన నాడీ వ్యవస్థ అధికంగా ప్రేరేపించకుండా నిరోధిస్తుంది. అధిక ఉద్దీపన రక్తపోటును పెంచుతుంది మరియు నిద్రలో గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది. ఒక పరిశోధనలో, కొంతమంది వ్యక్తులు బీట్‌రూట్ రసాన్ని స్థిరంగా తినడానికి ముందుకొచ్చారు. అతని రక్తపోటు కేవలం ముప్పై నిమిషాల్లోపు తగ్గింది. కానీ తరువాతి ఇరవై నాలుగు గంటల్లో ఒత్తిడి పెరిగింది. క్యాన్సర్‌తో పోరాడగలదు బీటా సానిన్, పోషకాలు అధికంగా ఉండే యాంటీఆక్సిడెంట్, క్యాన్సర్ కారక ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి ప్రసిద్ధి చెందింది. ఇది కొన్ని రకాల క్యాన్సర్ల నుండి బీట్‌రూట్ రక్షణ అందిస్తుంది. బీట్‌రూట్ రసం లో రోగ నిరోధక లక్షణాలు రక్తం మరియు ఎముక మజ్జ క్యాన్సర్‌ను నయం చేయడంలో కూడా సహాయపడతాయి. ఈ ప్రక్రియలో బెటాస్యానిన్ కూడా సహాయపడుతుంది. బీట్‌రూట్ కొన్ని రకాల క్యాన్సర్‌లకు చికిత్స చేయడానికి ఉపయోగించే మందులలో డోక్సోరోబిసిన్ ఒకటి.

డయాబెటిస్ చికిత్సలో సహాయపడుతుంది ఒక అధ్యయనంలో సగం కప్పు బీట్‌రూట్ రసం క్రమం తప్పకుండా తినేవారికి భోజనం తర్వాత రక్తంలో గ్లూకోజ్ స్థాయి తగ్గుతుందని తేలింది. దానిలోని శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు దీనికి కారణమవుతాయి. అధిక బరువు ఉన్నవారు కార్బోహైడ్రేట్లతో బీట్‌రూట్ రసాన్ని తీసుకునేప్పుడు కూడా ఇదే ప్రభావం కనిపిస్తుంది. ఈ వ్యక్తుల శరీరంలో ఇన్సులిన్ టాలరెన్స్ ఇతరులకన్నా ఎక్కువగా ఉందని గుర్తించబడింది. ఈ రసంలోని నైట్రేట్లు ముఖ్యంగా టైప్ – 2 డయాబెటిస్ ఉన్నవారికి మేలు చేస్తాయి.

మీరు అంగస్తంభన నుండి బయటపడవచ్చు బీట్‌రూట్ రసం తీసుకోవడం వల్ల అంగస్తంభన ఏర్పడుతుందని అధికారికంగా ధృవీకరించబడలేదు. అయితే, ఈ రసం తీసుకున్న వారిలో చాలా మందికి ఇది ప్రయోజనం చేకూరుస్తుందని చెప్పారు. కొన్ని అధ్యయనాల ప్రకారం, దానిలోని నైట్రిక్ ఆమ్లం బలహీనతను తగ్గించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అంగస్తంభనకు అవసరమైన రక్తం మొత్తం. కొన్ని కారణాల వల్ల ఇది తక్కువ అందుబాటులో ఉండవచ్చు. నైట్రిక్ ఆమ్లం రక్త నాళాలను సడలించి రక్త ప్రవాహాన్ని పెంచుతుంది. ఇది రక్తపోటును తగ్గించడం మరియు జననేంద్రియాలకు రక్త ప్రవాహాన్ని పెంచడం ద్వారా అంగస్తంభన ప్రమాదాన్ని తగ్గిస్తుంది. తేలికపాటి లోపానికి మరో ముఖ్యమైన అంశం సిజిఎంపి (సైక్లిక్ గ్వానోసిన్ మోనోఫాస్ఫేట్) అనే పోషకం. ఇది జననేంద్రియ నరాలను కూడా సడలించింది మరియు ఎక్కువ రక్త ప్రవాహానికి సహాయపడుతుంది. ఒక అధ్యయనం ప్రకారం, నైట్రేట్ అధికంగా ఉండే ఆహార పదార్థాల వినియోగం (ఇవి జీర్ణక్రియలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మార్చబడతాయి) రక్తంలో సిజిఎంపిని పెంచుతుంది, తద్వారా అంగస్తంభన తగ్గుతుంది.



అథ్లెట్లు వారి ఫిట్‌నెస్‌ను పెంచుకోవచ్చు బీట్‌రూట్ రసం వినియోగం గుండె మరియు ప్రసరణ మరియు ఊపిరితిత్తులతో దగ్గరి సంబంధం కలిగి ఉన్నట్లు కనుగొనబడింది. ఈ రసం తీసుకోవడం వల్ల అథ్లెట్ల క్రీడా ఫలితాల్లో పెరుగుదల ఉంది. కొంతమంది రన్నర్లు వరుసగా పదిహేను రోజులుగా బీట్‌రూట్ జ్యూస్ తాగుతూ వారి దినచర్యను అభ్యసిస్తున్నారు. కానీ ఇది అతని ఇతర క్రీడా సామర్థ్యాలను ప్రభావితం చేయదని కూడా గుర్తించబడింది. శారీరక ఫిట్‌నెస్ పరీక్షను ప్రారంభించడానికి కొద్దిసేపటి ముందు బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల సామర్థ్యం పెరిగినట్లు మరో అధ్యయనం కనుగొంది. కానీ ఈ పరీక్ష ఒక్కసారి మాత్రమే జరిగింది.

మెదడకు రక్తప్రవాహం ఈ అంశంపై మరిన్ని పరిశోధనలు ఇంకా ధృవీకరించబడలేదు. అయినప్పటికీ, కొన్ని వనరుల ప్రకారం, మెదడుకు అధిక రక్త ప్రవాహం అదనపు పదార్థంగా తీసుకున్నప్పుడు అవరోధం మరియు ఇతర సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

కాలేయం యొక్క సామర్థ్యాన్ని పెంచండి బీట్రూట్ జ్యూస్ కాలేయంలో ఆల్కహాల్ లేని కొవ్వు నిల్వ ఉంటే దీన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. ఈ వాస్తవం జంతువులపై పరిశోధనలో మాత్రమే కనుగొనబడింది. మరొక అధ్యయనంలో, ఎలుకలకు అదనపు పదార్థంగా బీట్‌రూట్‌లో బీటాలిన్ కంటెంట్ ఇవ్వబడింది.

జుట్టుకు రంగు వేయడానికి కూడా ఉపయోగించవచ్చు. ఇది నేరుగా ఆరోగ్య ప్రయోజనం కాకపోవచ్చు, కానీ ఇది హెయిర్ డైగా ఉపయోగించడం ద్వారా హానికరమైన కృత్రిమ రంగుల నుండి కాపాడుతుంది. బీట్‌రూట్‌ను ఎలా ఉపయోగించాలో మీకు తెలుసా? మీ రెగ్యులర్ హెయిర్ ఆయిల్ (కొబ్బరి నూనె వంటివి) మరియు బీట్‌రూట్ జ్యూస్‌లో సమాన కొలతతో తీసుకోండి. స్నానం చేసిన తర్వాత ఈ ద్రవాన్ని మీ జుట్టుకు రాయండి. తర్వాత తలకు ప్లాస్టిక్ హెయిర్ క్యాప్ ధరించండి. సుమారు గంటసేపు అలాగే ఉంచండి. తర్వాత ఒక గుడ్డతో తుడిచి ఆరబెట్టండి. మీరు బీట్‌రూట్‌ను ద్వేషిస్తున్నప్పటికీ, మీరు దాని లక్షణాల వల్ల తిరస్కరించలేరు. బీట్రూట్ మలబద్ధకానికి, ముఖ్యంగా బరువు తగ్గడానికి ఒక అద్భుతమైన ఔషధంగా పనిచేస్తుంది. కానీ ఈ లక్షణాలన్నీ దీనిని ఉపయోగించిన వ్యక్తులు చేసిన ప్రకటనలు మరియు ఇది సైన్స్ చేత నిరూపించబడలేదు. చికిత్సతో కొనసాగడానికి ముందు మీ వైద్యుడిని సంప్రదించండి. బీట్‌రూట్ రసం శక్తివంతమైన సమ్మేళనాలతో నిండి ఉంది.

బీట్‌రూట్ రసం ఎలా సేకరించాలి? అవసరమైన పదార్థాలు రెండు నుండి నాలుగు మధ్య తరహా బీట్‌రూట్‌లు. ఒక పాత్ర జ్యూసర్ బీట్‌రూట్‌లను బాగా కడగాలి. అవసరమైతే పొడి బట్టతో శుభ్రంగా తుడవండి. సున్నితంగాపై తొక్క తొలగించండి. బీట్‌రూట్‌ను చిన్న ముక్కలుగా చేసి జ్యూసర్‌లో వేయండి. మీకు నచ్చినంత నీరు మాత్రమే కలపండి. జ్యూసర్‌లో బాగా గ్రైండ్ చేయండి. ఈ రసాలను కంటైనర్‌లో భద్రపరుచుకోండి. ఈ రసాన్ని చల్లగా కూడా తీసుకోవచ్చు. రసం బాగా రుచిగా ఉండాలంటే సగం ఆపిల్ జోడించడం ద్వారా రుచికంగా తీసుకోవచ్చు. ఈ రసం రుచి కొద్దిగా వాసన లేకుండా ఉండటం వల్ల కొంచెం నిమ్మరసం కలపవచ్చు. ఈ రసాన్ని బీట్‌రూట్ గుజ్జుతో వడ్డించండి. ఇది మంచి మొత్తంలో కరగని ఫైబర్ కలిగి ఉంటుంది, ఇది మలబద్ధకాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. బీట్‌రూట్ యొక్క దుష్ప్రభావాలు అమృతం కూడా అధికంగా తీసుకుంటే విషం అవుతుందన్న విషయం మనకు తెలిసిందే. అదేవిధంగా, బీట్‌రూట్ రసం వినియోగం పరిమితం చేయాలి.

**దీని వల్ల దుష్ప్రభావాలు**

బీటూరియా ఎదుర్కోవచ్చు బీటురియా మూత్రం యొక్క రంగు. ఈ రంగు బీట్‌రూట్‌లోని బీటాసైయానిన్ తరగతికి ఆపాదించబడింది. కానీ ఈ స్థితిలో తప్పు లేదు. మూత్రం యొక్క రంగు మారితే, రక్తం ఉందనే అనుమానాన్ని సృష్టించడం ఆందోళనకరంగా ఉంటుంది. అయినప్పటికీ, మూత్ర విసర్జనతో (రక్తహీనత ఉన్నవారిలో వంటివి) ఇతర సమస్యలు ఉంటే, మూత్రం రంగులో లేకుంటే బీట్‌రూట్ తీసుకోవడం భిన్నంగా ఉంటుంది. ఇది వైద్యులకు కూడా గందరగోళంగా ఉంటుంది. కాబట్టి మూత్రవిసర్జన సమయంలో బీట్‌రూట్ తీసుకోవడం లేదు. మిగతావన్నీ పరిమితం. మూత్రపిండాలలో రాళ్ల ప్రమాదాన్ని పెంచుతుంది బీట్‌రూట్‌లోని ఆక్సలేట్లు మూత్రపిండంలో రాళ్ల సంభావ్యతను పెంచుతాయి. అందువల్ల, బీట్‌రూట్ రసం అధిక మొత్తంలో ఆక్సలేట్ చేరడానికి దారితీస్తుంది మరియు మూత్రపిండంలో ఇప్పటికే ఉన్న చిన్న రాళ్లను పెద్దగా విస్తరిస్తుంది. మీకు కిడ్నీ వెనుక భాగంలో రాళ్ళు ఉంటే మీరు బీట్‌రూట్ తీసుకోనవసరం లేదు. రక్తపోటు చాలా తక్కువగా ఉంటుంది అధిక రక్తపోటు కంటే తక్కువ రక్తపోటు ఎక్కువ ప్రాణాంతకం! మీరు ఇప్పటికే అధిక రక్తపోటుకు మందులను తీసుకుంటుంటే, బీట్‌రూట్ తీసుకోవడం మీ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అందువల్ల, బీట్‌రూట్ తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. మీ డాక్టర్ మీ ఆహారం ఆధారంగా మందు లను సూచించవచ్చు. దీని గురించి తెలుసుకోండి బీట్‌రూట్ అద్భుతమైన ఆహారం అని ఖండించలేదు. దీనిని పచ్చిగా, వండిన, సలాడ్ గా తినవచ్చు మరియు వాఫ్ఫల్స్ కొరకు సైడ్ డిష్ గా వడ్డిస్తారు. దీన్ని రోజూ తినవచ్చు. ఉదయం, మధ్యాహ్నం మరియు సాయంత్రం ఎప్పుడైనా తినవచ్చు. ఇది దీర్ఘకాలిక వినియోగం కంటే అనేక ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందిస్తుంది. అయితే దీన్ని మోడరేట్ చేయడం ముఖ్యం. అలాగే, మూత్రపిండాల సమస్య ఉన్నవారికి బీట్‌రూట్ సిఫారసు చేయబడలేదు.

# ఎల్ అండ్ టి నుంచి మెట్రో రైలు పూర్తి స్వాధీనం

- మెట్రో విస్తరణకు తొలగనున్న అడ్డంకులు
- స్వాధీన ప్రక్రియ పర్యవేక్షణకు భట్టి ఆధ్వర్యంలో ఉపసంఘం
- మార్చి 31లోగా మెట్రో స్వాధీన ప్రక్రియ పూర్తికి నిర్ణయం
- డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా వైద్యవిధాన పరిషత్
- ఖమ్మం జిల్లాలో టిటిడి నిర్మాణాలకు 20 ఎకరాలు
- మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరులో జేఎన్‌టీయూకు 70 ఎకరాలు
- అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ కార్యాలయాలకు భూ కేటాయింపులు
- మార్చి 16 నుంచి 30 వరకు అసెంబ్లీ సమావేశాలు
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు



File Photo

**హైదరాబాద్,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** హైదరాబాద్ మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ క్యాబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే దీనిపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. స్వాధీనం చేసుకునే ప్రక్రియను పర్యవేక్షించడానికి మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఈ కమిటీలో.. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు సభ్యులుగా ఉంటారు.. ఇకపోతే మార్చి 16 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. 30 వరకు ఈ సమావేశాలు జరుగుతాయి. తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ ప్రసంగం ఉంటుంది. 20న బడ్జెట్ ప్రవే శ పెడతారు. దీనికి కేబినేట్ ఆమోదం తెలిపింది. ఇకపోతే మెట్రోకు సంబంధించ గత ఏడాది సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా ఎల్‌అండ్‌టీకి చెల్లించేలా.. రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకునేలా అవగాహనకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాతే స్వాధీన ప్రక్రియ మొదలైంది. మెట్రో ఆస్తులు, వాటి విలువను ఐడీబీఐ క్యాపిటల్.. రైళ్లు, ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థ వంటి సాంకేతిక అంశాలపై డీఎంఆర్‌సీ మదింపు చేసి ప్రాథమిక నివేదికలిచ్చాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రోపై తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోని నిర్వహిస్తున్న ఎల్‌అండ్‌టీ నుంచి పూర్తిగా ప్రభుత్వాధీనంలోకి తీసుకునేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ప్రకారం మార్చి 31వ తేదీలోపు మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ టేకోవర్ మొత్తం విలువ సుమారు రూ.15,000 కోట్లుగా అంచనా వేసింది. ఇందులో మెట్రోపై ఉన్న అప్పులు రూ.13,000 కోట్లు కాగా, ఎల్ అండ్‌టీ సంస్థ ఈక్విటీ వాటా రూ.2,000 కోట్లుగా ఉంది. మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలంటే మొదటి దశ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని కేంద్ర ప్రభుత్వం షరతు విధించింది. ఈ నేపథ్యంలోనే మెట్రోను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంతో హైదరాబాద్ మెట్రో విస్తరణకు మార్గం సుగమం కానుంది. నగరంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆధీనంలోకి మెట్రో వచ్చిన తర్వాత.. మెట్రో విస్తరణ వేగవంతం అవుతుంది. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుంది. రవాణా వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉంటుంది. భవిష్యత్ ప్రాజెక్టులకు కేంద్ర సహాయం పొందడం సులభం అవుతుంది. ఇది నగర అభివృద్ధికి కీలక నిర్ణయంగా భావిస్తోంది. ఇకపోతే ఈ సమావేశంలో రాష్ట్ర పురోగతికి సంబంధించి పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. వైద్య విధాన పరిషత్‌లో మార్పులు , భూ కేటాయింపులపై కేబినెట్ ముద్ర వేసింది. రాష్ట్రంలోని వైద్య రంగంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 'తెలంగాణ వైద్య విధాన పరిషత్' పేరును ఇకపై 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్'గా మారుస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మార్పుతో పాటు, ఇప్పటివరకు పరిషత్ పరిధిలో ఉన్న ఉద్యోగులను పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులు గా పరిగణించాలని నిర్ణయించారు. దీనివల్ల వేలమంది వైద్య సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. రాజకీయ పార్టీల బలోపేతానికి సంబంధించి కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి భూమిని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.మరికొన్ని కీలక భూ కేటాయింపులపై కూడా కేబినెట్ స్పష్టతనిచ్చింది. ఖమ్మం జిల్లాలో టీటీడీ ఆలయ నిర్మాణం లేదా ఇతర ఆధ్యాత్మిక సేవల కోసం 20 ఎకరాల భూమిని కేటాయించారు. మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరు లో కొత్తగా జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజ్ నిర్మాణానికి గాను 70 ఎకరాల భూమి కేటాయింపుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరిపాలనా సౌలభ్యం కోసం , రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం తీసుకున్న ఈ నిర్ణయాలు తక్షణమే అమలులోకి రానున్నాయి. స్వల్ప అనారోగ్యం కారణంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశానికి హాజరు కాలేదు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన జనగణనపై మంత్రిమండలి భేటీలో కీలక చర్చ జరిగింది. ఈ చర్చలో జనగణన వివరాలను తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. రెండు దశల్లో జనగణన పక్రియ 2027 ఫిబ్రవరిలో రెండో దశ ప్రారంభం కానుంది. జనగణన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లపై మంత్రివర్గంలో చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన జన గణన పక్రియను చేపట్టేందుకు ప్రభుత్వం కీలక ఆమోదం తెలిపింది. ఈ భారీ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వసన్నద్ధమవుతోంది. ఈ సమావేశంలో ముఖ్యంగా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన తొలి విడత ఇండ్ల గణన అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ రామకృష్ణరావు ఈ పక్రియకు సంబంధించిన ఏర్పాట్లను కేబినెట్‌కు వివరిస్తూ, మే 11వ తేదీన ఈ గణనను ప్రారంభించి జూన్ 9వ తేదీ వరకు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ హౌజ్ లిస్టింగ్ ప్రక్రియ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్దేశిరచిన 34 ప్రశ్నలతో కూడిన నమూనా పత్రాన్ని ప్రభుత్వం వినియోగించనుంది. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించేందుకు సుమారు 84 వేల మంది ఎన్యుమ రేటర్లను, వారికి దిశానిర్దేశర చేసేందుకు నోడల్ ఆఫీసర్లను కలిపి మొత్తం 89 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులను ఈ విధుల్లో భాగస్వాములను చేయనున్నారు. తొలి దశ విజయవంతంగా ముగిసిన తర్వాత, అసలైన రెండో దశ జన గణన పక్రియను వచ్చే ఏడాది అంటే 2027 ఫిబ్రవరిలో చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల అంచనాకు ఈ గణన ఎంతో కీలకం కానున్న నేపథ్యంలో, ఎలాంటి లోపాలు లేకుండా ఈ పక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎన్యుమరేటర్లతో పాటు నోడల్ ఆఫీసర్లు మొత్తం 89 వేల మంది ఉద్యోగులు జనగణన ప్రక్రియలో పాలుపంచుకుంటారని తెలిపారు.

# సామాజిక సమానత్వం అనే లక్ష్యం కోసం కృషి

- వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు
- సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశాం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ఎక్కువ కేటాయింపులు
- కల్తీపాల మృతుల కుటుంబాలకు పదిలక్షల ఎక్స్‌గ్రేషియా
- అసెంబ్లీలో సిఎం చంద్రబాబు ప్రకటన



**అమరావతి, ఫిబ్రవరి 24 (ఆర్ఎన్ఎ):** సామాజిక సమానత్వం అనే లక్ష్యం కోసం ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రాజకీయంగా కూడా వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. అసెంబ్లీలో సోమవారం సంక్షేమ బ్జడెట్ కేటాయింపులపై చర్చించారు. సంక్షేమం విషయంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశామని ఉద్ఘాటించారు. ఆటో కార్మికులు, మత్స్యకారులు, చేనేతలకు కూడా మేలు చేశామని తెలిపారు. నిత్యావసర సరకులు కూడా సక్రమంగా అందించేలా సాంకేతికత సాయం తీసుకున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ఎక్కువ కేటాయింపులు చేశామని చెప్పుకొచ్చారు. బడ్జెట్ కేటాయింపులు అమలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని వివరించారు. స్వర్ణాంధ్ర – 2047 విజన్‌లో భాగంగా తలసరి ఆదాయం రూ.3 లక్షల నుంచి రూ.54 లక్షలకు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భావితరాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. అంగన్‌వాడీ నుంచి స్కూళ్లు, కాలేజీల వరకూ మంచి విద్య, వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పేద వర్గాల ఆదాయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించామని సీఎం చెప్పారు. పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తొలగించటానికి చర్యలు తీసుకుంటున్నామని చంద్రబాబు తెలిపారు. 10 లక్షల బంగారు కుటుంబాలను లక్షమంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నారని వివరించారు. 'నిరంతరం పర్యవేక్షిస్తేనే ఏ కార్యక్రమమైనా ఫలితాలనిస్తుంది. అట్టడుగున ఉన్న పేదవర్గాలనూ ఆదుకునేలా పీ4 ప్రణాళికలు ఉన్నాయి. పూటగడవని పేదవారిని ఎలా పైకి తీసుకురావాలో అందరూ ఆలోచించాలి. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్దేశిరచారు. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే పేదరికం ఉండరాదు. 2024 ఎన్నికల్లో ఏకపక్షంగా కూటమికి 94 శాతం విజయం కట్టబెట్టారు. బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కమిషన్ వేశాం. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే సమయానికి రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బీసీ జాబితాలోని కొన్ని వర్గాలను ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలనే డిమాండ్లను కూడా పరిశీలిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 'ఎస్సీ వర్గీకరణ తెచ్చి.. ఆ దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికి దక్కింది. గిరిజనుల కోసం తెచ్చిన జీఓఎంఎస్ నంబర్–3ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ విషయంపై ఏం చేయాలో గిరిజన సంఘాల నుంచి అభిప్రాయలు సేకరించి ముందుకెళ్తాం. మైనార్టీ వర్గాలకు కూటమి ప్రభుత్వం రక్షణ కల్పించిందని సీఎం చెప్పారు. రాజమహేంద్రవరం లోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లో స్థానికులు అస్వస్థతకు గురైన ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. లాలాచెరువు ప్రాంతంలో నలుగురు చనిపోయారని.. ఎనిమిది మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్నారు. వరలక్ష్మి డెయిరీకి చెందిన కల్తీ పాల వల్లే పలువురు అస్వస్థతకు గురైనట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిందని పేర్కొన్నారు. సెక్షన్ 194 కింద బాధ్యులపై కేసు నమోదు చేశామన్నారు.

# శ్రీకాకుళంలో డయేరియా కేసులు

## అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి నారాయణ

**అమరావతి,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ):** శ్రీకాకుళం జిల్లాలో డయేరియా కేసులు నమోదు కావడంపై రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ వెంటనే స్పందించారు. జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓ , నగరపాలక సంస్థ కమిషనర్‌తో ఆయన ఫోన్ ద్వారా మాట్లాడి తాజా పరిస్థితిని సమీక్షించారు. డయేరియా ప్రబలడానికి ప్రధాన కారణాలు ఏంటి? కలుషిత నీరా లేదా ఇతర ఆహారపు అలవాట్లా? అనే కోణంలో తక్షణమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరిన బాధితులకు ఎలాంటి లోటు లేకుండా మెరుగైన వైద్య సాయం అందించాలని మంత్రి నారాయణ సూచించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు మంత్రికి వివరించారు. వ్యాధి మరింత విస్తరించకుండా ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, తాగునీటి నాణ్యతను తనిఖీ చేయాలని మంత్రి నారాయణ ఆదేశించారు.

# కూతురిలా పెంచి హిందూ సంప్రదాయంలో వివాహం...



**నందిగామ ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో మానవత్వం మరోసారి విజయగాథ రాసుకుంది. కులమత భేదాల కంటే ప్రేమ, మంచితనమే గొప్పవని ఒక ముస్లిం దంపతులు తమ ఆచరణతో నిరూపించారు. తల్లిదండ్రులు లేని హేమలత అనే చిన్నారిని అబ్దుల్ బాషా, షబీనా దంపతులు చేరదీసి సొంత కూతురిలా పెంచి పెద్ద చేశారు. ఆమెకు విద్యాబుద్ధులు నేర్పించి భవిష్యత్తుకు బలమైన పునాది వేశారు. పసిప్పటి నుంచే అనాథగా మారిన హేమలతను చూసి చలించిన ఈ దంపతులు, ఆమె జీవితాన్ని మార్చాలని సంకల్పించారు. తల్లిదండ్రుల ప్రేమతో పెంచుతూ చదువులో ప్రోత్సహించారు. వారి ఆశయాలకు అనుగుణంగా హేమలత ఉన్నత విద్యను పూర్తిచేసి మంచి సంస్కారవంతురాలిగా ఎదిగింది. ఇటీవల ఆమెకు హిందూ యువకుడితో వివాహం జరిపించారు. ముఖ్యంగా హిందూ సంప్రదాయాల ప్రకారం శాస్త్రోక్తంగా పెళ్లి నిర్వహించడం విశేషం. కూతురి పెళ్లి కార్యక్రమాలను తల్లిదండ్రుల్లా బాధ్యతగా తీసుకుని ప్రతి వేడుకను ఆనందంగా పూర్తి చేశారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ వివాహం మతసామరస్యానికి నిదర్శనమని స్థానికులు కొనియాడుతున్నారు. "మనసులు కలిస్తే మతాలు అడ్డుకావు" అనే సందేశాన్ని ఈ దంపతులు ఇచ్చారని అభిప్రాయపడుతున్నారు. అబ్దుల్ బాషా, షబీనా దంపతుల సేవాభావం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోంది. చౌడేపల్లిలో జరిగిన ఈ సంఘటన కులమతాలకు అతీతంగా మానవత్వమే శాశ్వతమని మరోసారి రుజువు చేసింది. ప్రేమ, పరస్పర గౌరవం ఉంటే సమాజం మరింత సుస్థిరంగా ఎదుగుతుందనే సందేశాన్ని ఈ పెళ్లి అందించింది.


## ప్రజా సమస్యలపై స్పందన..

### 5 అర్జీలు స్వీకరణ...



**నందిగామ ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గుడివాడ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ ప్రజల నుంచి ఐదు అర్జీలను స్వీకరించారు. పట్టణ ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు స్వీకరించిన అర్జీలలో శానిటేషన్‌కు సంబంధించిన ఒకటి, ఆక్రమణలకు సంబంధించిన రెండు, కొత్త డ్రైనేజ్ నిర్మాణానికి సంబంధించిన రెండు అర్జీలు ఉన్నాయి. ప్రజలు తమ ప్రాంతాల్లో నెలకొన్న ఇబ్బందులను వివరించగా కమిషనర్ శ్రద్ధగా విన్నారు. అర్జీలను పరిశీలించిన అనంతరం సంబంధిత శాఖ అధికారులను వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి నివేదిక సమర్పించాలని సూచించారు. పట్టణాభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని కమిషనర్ పేర్కొన్నారు.

## నందిగామలో రాత్రి వేళ గర్జించిన మేఘాలు...



**నందిగామ ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నందిగామలో ఎండలు ముదురుతున్న తరుణంలో పరిసర ప్రాంతాల్లో సోమవారం రాత్రి వరుణుడు కరుణించాడు. ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని ఈదురు గాలులు, ఉరుములతో కూడిన చిరుజల్లులు కురిశాయి. రోజంతా మండిపోయిన ఎండలతో ఇబ్బందులు పడిన ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించింది. సాయంత్రం నుంచి ఆకాశం మబ్బులతో నిండిపోవడంతో వాతావరణంలో మార్పు కనిపించింది. అనంతరం గాలుల వేగం పెరిగి ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమైంది. కొన్నిచోట్ల తక్కువసేపే కురిసినా, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు జల్లులు పడ్డాయి. ఈదురు గాలుల కారణంగా చెట్ల కొమ్మలు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. వాతావరణ శాఖ వివరాల ప్రకారం, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో ఈ అకాల వర్షాలు నమోదయ్యాయి. ఈ ప్రభావం మరో ఒకటి రెండు రోజుల పాటు కొనసాగవచ్చని అధికారులు తెలిపారు. ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొత్తంగా, ఎండల తీవ్రత మధ్య వచ్చిన ఈ జల్లులు ప్రజలకు తాత్కాలిక ఊరట కలిగించాయి.

## గంగూరులో జూదంపై మెరుపు దాడి...



**నందిగామ ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పెనమలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగూరు గ్రామంలో జూదంపై పోలీసులు సోమవారం మెరుపు దాడి నిర్వహించారు. గ్రామంలోని ఠాగూర్ రైస్ మిల్ వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో కొందరు వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా జూదం ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. పోలీసులను గమనించిన కొందరు పారిపోవడానికి ప్రయత్నించగా, సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.55,250 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఘటన స్థలంలో జూదానికి ఉపయోగించిన సామగ్రిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం అందించాలని సూచించారు.

## బాలికల రక్షణ చట్టాలపై అవగాహన



**మచిలీపట్నం ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మహిళలు, బాలికల రక్షణే ధ్యేయంగా రక్షణ చట్టాలు మాదక ద్రవ్యాల పై అవగాహన కల్పిస్తున్న కృష్ణాజిల్లా పోలీసులు,మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది, శక్తి టీం ఈగల్ టీం సభ్యుల ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని విజయానంద డిగ్రీ కాలేజీ నందు విద్యార్థినీ విద్యార్థులకు మాదక ద్రవ్యాల వ్యసనం, సైబర్ క్రైమ్, పోక్సో చట్టం, శక్తి యాప్ యొక్క ఆవశ్యకత, ట్రాఫిక్ నిబంధనలు వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వలన శారీరక, మానసిక సామాజికంగా కలిగే తీవ్రమైన దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించారు.. అదనంగా సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగం, అనుమానాస్పద లింకులు, ఫేక్ అకౌంట్లు, ఆన్‌లైన్ మోసాల నుండి జాగ్రత్తలు తీసుకోవడం వంటి విషయాలు తెలిపారు. పిల్లల రక్షణ కోసం అమలులో ఉన్న పోక్సో చట్టంలోని ముఖ్య నిబంధనలు, చట్టపరమైన రక్షణలు సహాయ మార్గాల గురించి కూడా విద్యార్థులకు తెలియజేసారు.

ప్రతి ఒక్కరు శక్తి యాప్ ను కలిగి ఉండాలని దాని యొక్క వినియోగం ,ఆవశ్యకతల గురించి విద్యార్థిని విద్యార్థులకు తెలిపారు. రహదారి భద్రత నియమాలు పాటించడం వల్ల జరిగే ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమం మొత్తం సమయంలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని ప్రశ్నలు అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంతో, ఈ అవగాహన కార్యక్రమం వారి భద్రత, బాధ్యత, చట్టపరమైన అవగాహనను పెంపొందించే దిశగా ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.

## 'అక్షర ఆంధ్ర' కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరి



**అనంతపురం ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా కార్యక్రమాలు అమలు చేయాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో 'అక్షర ఆంధ్ర' కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యత సాధనకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. జిల్లాలో 1,25,578 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా నిర్దేశించామన్నారు. వార్డుస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అక్షర కేంద్రాలను అధికారులు సందర్శించి హాజరు శాతం పెంచి కార్యక్రమాన్ని సజావుగా నడిపించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన రహార్, డీఆర్ఓ మలోల, ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ కేశవనాయుడు, వయోజన విద్య ఉప సంచాలకులు సంపంగి వెంకటేశ్వర్లు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

## సమాజ రుగ్మతలు తొలగించేవి నాటకాలు



**శ్రీకాకుళం ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** సమాజంలో రుగ్మతలను ఎత్తి చూపి వాటిని తొలగించేందుకు నాటకాలు ఎంతగానో ఉపయోగపడతాయని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్ వేదికగా జరుగుతున్న నాటక పోటీల ముగింపు ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ ప్రతి ఏడాది మంచి నాటక పోటీలను నిర్వహించి, కళను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. విద్యా మౌళిక వసతుల డైరెక్టర్ పీఎంజే బాబు, మొదలవలస రమేష్‌లు మాట్లాడుతూ కళా సేవ ఎంతో ఉత్తమమైనదన్నారు.

# ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల ప్రిన్సిపల్, డైరెక్టర్ల పై కేసు నమోదు




పట్టణంలోని ఓ విద్యాసంస్థ యాజమాన్యం ప్రిన్సిపల్ పై కేసు నమోదు చేసినట్లు వన్ న్ సిఐ ఫిరోజ్ మంగళవారం తెలిపారు. వివరాల్లోకెళ్తే...

**నరసరావుపేట, ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గత కొన్నేళ్లుగా పట్టణంలో ఆక్స్ఫర్డ్ పేరుతో విద్యాసంస్థను పలు బ్రాంచ్లను ఏర్పాటు చేసి నడుపుతున్నారు. సోమవారం ప్రకాష్ నగర్ బ్రాంచ్ లో పదో తరగతి విద్యార్థినిపై అకారణంగా ప్రిన్సిపాల్ శివారెడ్డి దాడి చేశారని విద్యార్థిని ఆరోపించింది. ఫీజు బకాయిలను మనసులో పెట్టుకుని విద్యార్థులను అవమానిస్తూ చావకొడుతున్నట్లు విద్యార్థిని ఆరోపించింది. ఈ విషయంపై సోమవారం పట్టణంలో స్కూల్ వద్ద విద్యార్థిని తల్లిదండ్రులతో పాటు ఎస్ఎఫ్ఐ, ఎన్ ఎస్ యు ఐ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొని పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. పంచాయితీ పోలీస్ స్టేషన్ కు చేరింది. యాజమాన్యం తమ రాజకీయ పలుకుబడితో వ్యవస్థలను మేనేజ్ చేయాలని చూశారు. సాయంత్రం వరకు హైడ్రామా నడిచింది. ఎట్టకేలకు విద్యార్థిని ఫిర్యాదు మేరకు ఆక్స్ఫర్డ్ ప్రిన్సిపల్ సిలార్, డైరెక్టర్లు శంకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి పై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

# ఏళ్ల తరబడి పని చేస్తున్నా అరకొరా వేతనాలేనా...

### -రెండవ రోజుకు చేరిన అంగన్వాడీల రీలే నిరాహార దీక్ష...




**నరసరావుపేట, ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ 26 వేలు అమలు చేయాలని ఏపి అంగన్వాడీ వర్కర్స్ ఢ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణం గాంధీ పార్క్ ధర్నా చౌక్ లో అంగన్వాడీలు చేపట్టిన రీలే నిరాహార దీక్షలు మంగళవారం 2వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివ కుమారి పూల మాలలు ప్రారంభింప చేశారు. ఈ సందర్భంగా యూనియన్ పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షురాలు గుంటూరు మల్లీశ్వరి మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 5 రోజుల రీలే రిలే దీక్షలకు పిలుపునిచ్చామన్నారు. అంగన్వాడీ వర్కర్లకు కనీస వేతనంతో పాటు గ్రాట్యూటి అమలుకు గైడ్ లైన్స్ రూపొందించాలని మిగిలిపోయిన 1810 మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి హయాంలో వేతనాల కోసం ఆందోళన చేయగా మద్దతు తెలిపి భరోసా ఇచ్చిన టిడిపి, జనసేన నాయకులు అధికారంలోకి వచ్చాక అంగన్వాడీల సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో యూనియన్ పల్నాడు ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, నాయకులు అహల్య,సుజాత, భాగ్యలక్ష్మి, అమల,తులసి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

ఏపిడబ్ల్యూజెఎఫ్ సంఘీభావం...

అంగన్వాడీలకు కనీస అమలు చేయాలని బడ్జెట్లో అందుకు తగినట్లు నిధులు కేటాయించాలని ఏపిడబ్ల్యూజెఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు బిఎన్.ప్రసాదరావు అన్నారు. అంగన్వాడీల దీక్షలకు ఆయన సంఘీభావం తెలిపారు.గౌరవ వేతనంతో విశేష సేవలు అందిస్తున్న అంగన్వాడీల న్యాయమైన కోర్కెలు పరిష్కరించి వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.ఏపిడబ్ల్యూజెఎఫ్ యూనియన్ నాయకులు జిలాని, ఆదాం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# శిష్టకరణాల సామాజిక వర్గాన్ని ఆదుకోవాలి

### -సామాజిక భవనాలకు నిధులు మంజూరు చేయాలి.



**మచిలీపట్నం ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఉద్యోగ, ఉపాధి ఆర్థిక రంగాల్లో వెనుకబడిన శిష్టకరణాలను ఆదుకోవాలని టిడిపి శిష్టకరణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్, ఏపీ శిష్టకరణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అక్కుమహంతి రాజా కేంద్ర విమానాయనశాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కు విజ్ఞప్తి చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల రెండు రోజుల పర్యటనకు ఆదివారం విచ్చేసిన ఆయన కిడ్నీ తదితర సమస్యలల్లో ఉన్న కొన్ని శిష్టకరణ కుటుంబాలను పలకరించారు. అనంతరం శ్రీకాకుళం లో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ను కలిసి శిష్టకరణాల దయనీయ స్థితిగతులను వివరించారు. ముఖ్యంగా కేంద్ర బీసీ జాబితాలో శిష్ట కరణ సామాజిక వర్గాన్ని చేర్పించడం లో ప్రయత్నాన్ని ముమ్మరం చెయ్యాలని, సామాజిక భవన నిర్మాణాలకు, స్థలాలు- నిధులు కేటాయించడంలో, ఆర్థిక చేయుత నిమిత్తం సంక్షేమ పథకాలు సంపూర్ణంగా చేరడం కోసం శిష్టకరణ కార్పొరేషన్ కు చైర్మన్, డైరెక్టర్ లను నియమించడం లో కృషి చెయ్యాలని కోరారు. సోమవారం దివంగత ప్రజానేత కింజరాపు ఎర్రన్నాయుడు జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన అరసవల్లి లో గల మాజీ టీడీపీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిఇంటికి చేరుకుని ఆమె భర్త మృతి కారణంగా ఆమెకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఇదే సమయంలో అక్కడకు చేరుకున్న మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ తో కూడా ముచ్చటిస్తూ టిడిపి ప్రభుత్వ ప్రగతిని, ఒకనాటి నాయకుల కృషిని గుర్తుచేసుకున్నారు. శిష్టకరణ సాధికార సమితి రాష్ట్ర నాయకులు మానాపురం గౌరీశ్వర రావు సదాశివుని వెంకటేశ్వర రావు, మునగవలస రవీంద్రబాబు, కుప్పిలి వెంకట రమణమూర్తి, కరకవలస ప్రహ్లాదరావు, ఎస్విడి మురళి, ఆర్వీన్ శర్మ, పెదపెంకి శ్రీరామ్ కుమార్, బలివాడ గోవిందరావు, డబ్బీరు వెంకట రావు , బెహరా నాగేశ్వర రావు తదితరులు వీరితోపాటు ఉన్నారు.

# అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల నుండి వస్తు సేవల పన్నులు సజావుగా వసూలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో వాణిజ్య పన్నుల వసూలు పై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో ఆస్తులు, భూముల క్రయవిక్రయాలు జరిగినప్పుడు అందుకు సంబంధించిన వివరాలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందజేయాలన్నారు. తప్పనిసరిగా వస్తు సేవల పన్నులు వసూలు అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత వ్యక్తులకు సంబంధించి బ్యాంకు వివరాలను కూడా వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందజేయాలన్నారు. పట్టణాలలో గాని గ్రామ పంచాయితీలలో గాని ప్రభుత్వం చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్ లు తప్పనిసరిగా వస్తు సేవల పన్ను చెల్లించాల్సి ఉంటుందని అటువంటి వివరాలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందజేయాలన్నారు. అలాగే పౌర సరఫరాలు, తూనికలు కొలతలు, గనులు భూగర్భ శాఖల అధికారులు టాస్క్ ఫోర్స్ ఏర్పాటై ఉమ్మడిగా వాహనాలను తనిఖీ చేసి వస్తు సేవల పన్ను వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో కూడా వృత్తి పన్ను వసూలు చేస్తున్నారా లేదా విచారించి అందుకు సంబంధించిన వివరాలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ జి కల్పన, అదనపు ఎస్పీ వి నాయుడు, వాణిజ్య పనుల శాఖ సహాయ కమిషనర్లు సౌమ్య, జగదీష్, రాజకుమార్, డిపిఓ డాక్టర్ జె అరుణ, డిఎస్ఓ మోహన్ బాబు జెడ్పి డిప్యూటీ సీఎం సిఈఓ ఆనంద్ కుమార్ జిల్లా ఆడిట్ అధికారి సూర్య ప్రకాష్ రావు జిల్లా రిజిస్ట్రార్ గోపాలకృష్ణ గనులు భూగర్భ శాఖ ఏజీ కొండారెడ్డి మచిలీపట్నం తాడిగడప ఉయ్యూరు మునిసిపల్ కమిషనర్లు బాపిరాజు, నజీర్, రామారావు వాణిజ్య పన్నుల శాఖ డి ఏ సి చంద్రశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# దళారుల చేతిలో మోసపోకండి



**పత్తిపాడు ఫిబ్రవరి 24 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రైతులు దళారుల చేతిలో మోసపోవద్దని జిల్లా వ్యవసాయాధికారి ఎం. పద్మావతి అన్నారు. విత్తనాలు నుంచి పంటి విక్రయం వరకు ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పెదనందిపాడు మండలం పాలపర్రులోని జీడీసీఎంఎస్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎం.పద్మావతి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ రైతులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పద్నాలుగు శాతం తేమ ఉండేలా చేసుకోవాలన్నారు. తొలుత రైతులు రైతు సేవ కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకుని, ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం ఎకరానికి పన్నెండు క్వింటాళ్ల చొప్పున, ఒక రైతు 40 క్వింటాళ్ల వరకు విక్రయించుకోవచ్చని వివరించారు. ఈ క్రాప్ ఆధారంగా జీడీసీఎంఎస్ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధర రూ. 5,870కు శనగలు విక్రయించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం టి. నరసింహారెడ్డి, గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎన్. మోహన్‌రావు, మండల వ్యవసాయ అధికారి ఐ. సుబ్రహ్మణ్యం, రైతులు పాల్గొన్నారు.




# దురంధర్ టీమ్ భలే స్ట్రోక్ ఇచ్చింది



ప్రాణానికి ప్రాణం అనేది పాత సామెత. స్ట్రోకుకు స్ట్రోకు కొత్త ట్రెండ్. ఇటీవలే ఒక ఇంటర్నేషనల్ మ్యాగజైన్ కు చెందిన ఇండియన్ ఎడిషన్ అవార్డుల ఫంక్షన్ నిర్వహించింది. దానికి బాలీవుడ్ నుంచి బడా సెలబ్రిటీలు హాజరయ్యారు. సదరు బ్రాండ్ పవర్ అలాంటిది. కానీ దురంధర్ బృందం నుంచి ఒక్కరు రాలేదు. పన్నెండు వందల కోట్లకు పైగా వసూలు చేసి, ఎనభై రోజులకు దగ్గరవుతున్నా, ఇంకా థియేటర్లలో ఆడుతున్న అరుదైన మూవీగా, యాంకర్ గొప్పగా ప్రశంసిస్తూ అవార్డును తీసుకోవాల్సిందిగా కోరుతూ అనౌన్స్ మెంట్ ఇచ్చింది. తీరా చూస్తే అక్కడ ఎవరు లేరు. హీరో నుంచి దర్శకుడి దాకా అందరూ ఆబ్సెంట్. ఎందుకయ్యా అంటే దురంధర్ మీద నెగటివ్ రివ్యూ ఇచ్చి దీన్నో యాంటీ పాకిస్థాన్ కంటెంట్ గా వర్ణించిన రివ్యూయర్ సదరు మ్యాగజైన్ ఎడిటర్ కాబట్టి. రిలీజ్ టైంలో ఆవిడ సమీక్ష మీద తీవ్ర విమర్శలు రావడంతో ఆ వీడియోని యూట్యూబ్ నుంచి తొలగించడం అప్పట్లో సంచలనం రేకెత్తించింది. అనలిస్ట్ గా చాలా పేరున్న ఆమెకు అదో బ్లాక్ స్పాట్ లా మిగిలిపోయింది. కట్ చేస్తే ఇప్పుడు వాళ్లే స్వయంగా అవార్డు ఇస్తామని చెప్పినా దురంధర్ టీం రాకుండా ఝలక్ ఇచ్చింది. సినిమా బాలేదని చెప్పడం తప్పు కాదు. అది వ్యక్తిగత అభిప్రాయం. కానీ శత్రుదేశానికి మద్దతనిపించేలా కామెంట్స్ చేయడం చాలా మందికి నచ్చలేదు. ఇప్పుడీ వీడియో ఎక్స్ లో బాగా వైరల్ అవుతోంది. దీని సంగతి అలా ఉంచితే దురంధర్ టీమ్ చాలా ఒత్తిడిలో ఉంది. మార్చి 19 విడుదల తేదీ ఎంతో దూరంలో లేకపోవడంతో పోస్ట్ ప్రొడక్షన్ పరుగులు పెట్టిస్తూ ప్రమోషన్లను ప్లాన్ చేసుకొంటోంది. ముఖ్యంగా పోటీలో ఉన్న టాక్సిక్ ఎంతో అడ్వాన్స్ గా స్క్రీన్లను బ్లాక్ చేసుకునే పనిలో ఉండటంతో దురంధర్ 2 సైతం పరుగులు పెట్టాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ ఏడాది అతి పెద్ద ఓపెనింగ్స్ తెచ్చుకునే అవకాశాలు ఉన్న రెండు సినిమాలు ఇలా పరస్పరం తలపడటం గురించి ట్రేడ్ వర్గాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎవరైనా వెనక్కు తగ్గే అవకాశాలు నూటికి నూరు శాతం లేవు.

## చరణ్‌పై మచ్చ పడనివ్వని అల్లు శిరీష్



మెగా, అల్లు బంధం మీద ఎప్పటికప్పుడు రకరకాల ఊహాగానాలు, అనుమానాలు వస్తూనే ఉంటాయి. ఇరు కుటుంబాల మధ్య సంబంధాలు ఒకప్పట్లా లేవంటూ సోషల్ మీడియాలో అభిమానులు తెగ చర్చించుకుంటూ ఉంటారు. కానీ సినిమా సంబంధిత విషయాలు ఎలా ఉన్నా కుటుంబ పరంగా కలవాల్సిన సందర్భాలు వచ్చినపుడు.. ఎంతో అన్యోన్యంగానే వ్యవహరిస్తుంటారు ఇరు కుటుంబాల సభ్యులు. అల్లు వారి కుటుంబంలో మార్చి 6న ఒక శుభకార్యం జరగనున్న సంగతి తెలిసిందే. అల్లు అరవింద్ చిన్న కొడుకు శిరీష్ ఆ రోజే ఒక ఇంటివాడు కాబోతున్నాడు. గత కొన్ని రోజులుగా పెళ్లి పనులు జోరుగా జరుగుతున్నాయి. ఓవైపు శుభలేఖలు పంచుతున్నారు. ఇంకోవైపు సంబరాలు జరుగుతున్నాయి. అల్లు బ్రదర్స్ కలిసి ఇటీవలే కుటుంబ సభ్యులు, సన్నిహితులకు గ్రాండ్ పార్టీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ పార్టీలో రామ్ చరణ్ సైతం పాల్గొన్నాడు. ఐతే ఏటా ఈ సమయంలో చరణ్ స్వామి మాల వేస్తాడన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు కూడా మాలలో ఉండే పార్టీకి హాజరయ్యాడు. ఐతే అందరూ మద్యం తాగే పార్టీకి స్వామి మాల వేసుకున్న చరణ్ ఎలా వచ్చేడనే ప్రశ్నలు సామాజిక మాధ్యమాల్లో తలెత్తుతున్నాయి. ఇన్‌స్టాలో తాజాగా ఒక నెటిజన్ “చరణ్ స్వామి” అంటూ ఒక కామెంట్ పెట్టాడు. ఐతే స్వామి మాల వేసుకుని పార్టీలో పాల్గొన్నాడని చరణ్ మీద ఎక్కడ అపవాదు పడుతుందో అని అల్లు శిరీష్ ఈ కామెంట్ మీద వెంటనే స్పందించాడు. తమలో ఎవ్వరూ ఆల్కహాల్ ముట్టకముందే చరణ్ స్వామి ఈ పార్టీకి వచ్చాడని.. తమను విష్ చేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడని.. అయ్యప్పస్వామి పట్ల తన ప్రేమ, నిబద్ధత వేరని వ్యాఖ్యానించాడు. చరణ్ మీద ఎలాంటి అపవాదు పడకుండా జాగ్రత్త పడ్డ శిరీష్ మీద మెగా, అల్లు ఫ్యాన్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు. కామన్ ఫ్రెండ్స్ ద్వారా పరిచయం అయిన నయనికను మార్చి 6న హైదరాబాద్‌లో పెళ్లాడబోతున్నాడు శిరీష్.

# రోమియో రక్తంలో ఏం చూపించబోతున్నారు




న్యాచురల్ స్టార్ నాని తన ఇమేజ్ ని ఏ దిశగా తీసుకెళ్తున్నాడో ప్రేక్షకులకు పూర్తి క్లారిటీ వచ్చేస్తోంది. దసరాతో తెచ్చుకున్న మార్కెట్ ని సరిపోదా శనివారం, హిట్ 3తో బలపరుచుకుని ఆగస్ట్ లో రిలీజయ్యే ది ప్యారడైజ్ తో దాన్ని పీక్స్ కు తీసుకెళ్తాడనే నమ్మకం ఫ్యాన్స్ లో పూర్తిగా ఉంది. ఇదిలా ఉండగా దీని తర్వాత చేయబోయే మూవీ అఫీషియల్ అనౌన్స్ మెంట్ వచ్చేసింది. ఓజి ఫేమ్ సుజిత్ దర్శకత్వంలో రూపొందబోయే మూవీకి బ్లడీ రోమియో టైటిల్ ఫిక్సైయిపోయింది. ఇది గతంలో లీకైన న్యూస్ అయినప్పటికీ ఫైనల్ గా అధికారిక ముద్ర పడింది. ఇవాళ నాని బర్త్ డేకి చిన్న యానిమేషన్ టీజర్ వదిలారు. హీరో క్యారెక్టరైజేషన్ ఎలా ఉండబోతోందో వేరే ఆర్టిస్టుల వాయిస్ ఓవర్ ద్వారా వినిపించారు. అదిరిరిపోయే వంటకు దినుసులు ఎంత ముఖ్యమో వాటిని అద్భుతంగా వాడే చెఫ్ కూడా అంతే అవసరం. అలాగే శత్రువులను తుదముట్టించి మాఫియా సామ్రాజ్యాన్ని చేజిక్కించుకోవాలనుకునే వాళ్లకు తెగించే మనస్తత్వం, అడ్డొస్తే చంపిపారేసే క్రూరత్వం ఉండాలి. అలాంటి చేయి తిరిగిన వంటగాడే రోమియో. పేరుకి తగ్గట్టే ఇతనికో ప్రేమకథ కూడా ఉంటుంది. విజువల్స్ లో కిచెన్, సిలిండర్, దానికి బాంబు కట్టడం, రోమియో నాన్ వెజ్ వండటం, బిల్డింగ్ బ్లాస్ట్ అయితే అతనొక్కడే బయటికి రావడం ఇవన్నీ కార్టూన్ స్టైల్ లో చూపించారు. మొత్తానికి రోమియో రక్తంలో హింస బాగానే ఉండబోతోంది. గ్యాంగ్ స్టర్ అని స్పష్టంగా చెప్పేశారు కాబట్టి మరో ఓజి లాంటి కంటెంట్ తో సుజిత్ ఏదో మేజిక్ చేయడానికి రెడీ కాబోతున్నారు. వేసవి నుంచి షూటింగ్ ప్రారంభించబోతున్నారు. ప్రవీణ్ వైరా దీనికి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సమకూర్చగా ఈ కాన్సెప్ట్ మీద పెద్ద టీమే వర్క్ చేసింది. వెంకట్ బోయిన్ పల్లి నిర్మాతగా వ్యవహరించే ఈ మూవీ హీరోయిన్, టెక్నికల్ టీమ్ తదితర వివరాలు వెల్లడించాల్సి ఉంది. దసరా, హిట్ 3 ది థర్డ్ కేస్, సరిపోదా శనివారం, ప్యారడైజ్ ఇలా లైనప్ మొత్తాన్ని ఇంటెన్స్ డ్రామాలతో నింపేస్తున్న నాని బ్లడీ రోమియోతో దాన్ని నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్లబోతున్నాడు.



# బిజినెస్ న్యూస్




## గేమింగ్ లవర్స్ కోసం ఐకూ కొత్త ఫోన్.. ఊహించని ధరకు 15R



గేమింగ్ లవర్స్ ఎక్కువగా ఇష్టపడే ఐకూ బ్రాండ్ నుంచి మరో కొత్త స్మార్ట్‌ఫోన్ లాంచ్ అయ్యింది. ఐకూ 15 సిరీస్‌లో ఐకూ 15=ను దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. స్నాప్‌డ్రాగన్ 8 జన్ 5 ప్రాసెసర్, 7,600 ఎంఏహెచ్ బిగ్ బ్యాటరీతో ఈ ఫోన్‌ను తీసుకురావడం గమనార్హం. ఫ్లాగ్‌షిప్ ఫీచర్లతో తీసుకొచ్చిన ఈ ఫోన్ ధర, ఇతర వివరాలు ఇప్పుడు చూద్దాం.. ఊయీూ 15= ంజూవఎఱటఱ-ష్ఱశీఅం: ఐకూ 15ఆర్ ఆండ్రాయిడ్ 16తో కూడిన ఆరిజిన్ ఓఎస్ 6తో పనిచేస్తుంది. దీనికి నాలుగేళ్లు ఆండ్రాయిడ్ అప్‌డేట్స్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ హామీ ఇస్తోంది. 6.59 అంగుళాల 1.5ఖ అమోలెడ్ డిస్‌ప్లే, 120ఎఓ రిఫ్రెష్ రేటుతో వస్తోంది. 5000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఉంది. హెచ్‌డీఆర్ 10 సర్టిఫికేషన్, గేమింగ్ సమయంలో 144 ఎఓ రిఫ్రెష్ రేటుతో ఈ ఫోన్ పనిచేస్తుంది. ఇందులో స్నాప్‌డ్రాగన్ జన్ ఎస్5 ప్రాసెసర్ అమర్చారు. వెనుకవైపు 50 ఎంపీ సోనీ ఎల్‌వైటీ 700వీ ప్రధాన కెమెరా ఇచ్చారు. ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌తో వస్తోంది. 8 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఉంది. ముందు వైపు 32 ఎంపీ కెమెరా ఇచ్చారు. వైఫై 7, బ్లూటూత్ 6, టైప్-సీ పోర్ట్, ఐపీ68, ఐపీ 69 రేటింగ్‌తో వస్తోంది. ఇందులో 7,600 ఎంఏహెచ్ బ్యాటరీ 100ఔ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉంది. ఊయీూ 15= జూతీఱఎవ: ధర విషయానికొస్తే.. ఐకూ 15ఆర్ మూడు స్టోరేజీ వేరియంట్లలో లభ్యమవుతుంది. దీని ధర రూ.50 వేల పైనే ఉంటుందని ఊహించినప్పటికీ.. అంతకంటే తక్కువ ధరకే తీసుకురావడం గమనార్హం. 8జీబీం 256జీబీ వేరియంట్ ధర రూ.44,999గా కంపెనీ నిర్ణయించింది. 12జీబీం 256జీబీ వేరియంట్ రూ.47,999, 12జీబీం 512జీబీ వేరియంట్ రూ.52,999గా నిర్ణయించారు. డార్క్ నైట్, ట్రయంఫ్ కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. అమెజాన్, ఐకూ ఇండియా, వివో రిటైల్ స్టోర్లలో నేటి నుంచి బుకింగ్స్ స్వీకరిస్తున్నారు. మార్చి 3 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్‌కార్డ్/డెబిట్ కార్డు కొనుగోళ్లపై రూ.4వేలు డిస్కౌంట్ పొందొచ్చు. రూ.1899 విలువ చేసే ఐకూ/వివో టీడబ్ల్యూఎస్‌ను ఉచితంగా అందిస్తున్నారు.

## భారీ నష్టాల్లో సూచీలు: సెన్సెక్స్ 1069 పాయింట్లు డౌన్.. కారణాలు ఇవే



దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, కొత్త ఏఐ టూల్స్ మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ముఖ్యంగా ఐటీ, ఆటో స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ ఓ దశలో 1300 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 25,450 దిగువకు చేరాయి. మదుపర్ల సంపద రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.466 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 83,052.54 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,294.66) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 81,934.73 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1068.74 పాయింట్ల నష్టంతో 82,225.92 వద్ద ముగిసింది. నిఫ్టీ 288.35 పాయింట్ల నష్టంతో 25,424.65 స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.95గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఎన్టీపీసీ, హిందుస్థాన్ యూనిలీవర్, టాటా స్టీల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టైటాన్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.38 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5173 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ప్రముఖ ఏఐ స్టార్టప్ ఆంత్రోపిక్ క్లాడ్ కోడ్ అనే కొత్త టూల్‌ను విడుదల చేసింది. దీనిద్వారా పాతకాలపు ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ అయిన జూదీూ కోడ్‌ను చాలా వేగంగా, తక్కువ ఖర్చుతో ఆధునీకరించవచ్చని ఆ సంస్థ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా బ్యాంకులు, ప్రభుత్వాలు, ఇన్సూరెన్స్ సంస్థలు వాడే ఐబీఎం మెయిన్‌ఫ్రేమ్ కంప్యూటర్లలో అత్యధికంగా ఈ లాంగ్వేజ్‌నే ఉపయోగిస్తారు. ఈ సిస్టమ్స్‌ను అప్‌డేట్ చేయడం ఐబీఎంకు ఒక ప్రధాన ఆదాయ వనరుగా ఉంది. ఆంత్రోపిక్ ప్రకటన వల్ల ఐబీఎం వ్యాపారంపై ప్రభావం పడుతుందన్న ఆందోళన వ్యక్తమైంది. దీంతో ఒక్కరోజే ఆ కంపెనీ షేర్లు 13 శాతానికి పైగా కుంగాయి. 26 ఏళ్లలో ఎన్నడూ లేని స్థాయిలో ఐబీఎం నష్టాన్ని చవిచూసింది. ఐటీ రంగంలో వస్తున్న ఈ మార్పులు భారతీయ ఐటీ కంపెనీలపైనా ప్రభావం పడింది. ఐటీ దిగ్గజాలైన ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. సుంకాల విషయంలో అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అలుసుగా తీసుకుని ఏ దేశమైనా ఆటలాడాలని చూస్తే భారీ టారిఫ్‌లు విధిస్తానని ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. దీంతో మరోసారి టారిఫ్ భయాలు నెలకొన్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ భయాలు కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.

## ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు మోసం కేసు.. 24 గంటల్లో నిధులు వెనక్కి




చండీగఢ్: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ చండీగఢ్ శాఖలో చోటుచేసుకున్న మోసం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రభుత్వానికి చెందిన రూ.556 కోట్ల నిధులు రికవరీ అయినట్లు హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ మంగళవారం వెల్లడించారు. రూ.22 కోట్ల వడ్డీ సహా దాదాపు రూ.556 కోట్ల నిధులు 24 గంటల్లో వెనక్కి వచ్చినట్లు అసెంబ్లీ సాక్షిగా సీఎం వెల్లడించారు. చండీగఢ్ శాఖలోని మధ్య, చిన్నస్థాయి ఉద్యోగులు కలిసి ఈ మోసానికి పాల్పడినట్లు బ్యాంకు తెలిపిందని సైనీ పేర్కొన్నారు. ఈ మోసానికి పాల్పడింది ప్రైవేటు వ్యక్తి అయినా, ప్రభుత్వ ఉద్యోగి అయినా సహించేది లేదన్నారు. హరియాణా ప్రభుత్వానికి చెందిన బ్యాంకు ఖాతాల నుంచి రూ.590 కోట్ల మేర మోసానికి గురైనట్లు బ్యాంక్ ఆదివారం వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో దర్యాప్తునకు ఏసీబీని ఆదేశించినట్లు సీఎం తెలిపారు. ఆర్థిక శాఖ కార్యదర్శి నేతృత్వంలోని ఓ కమిటీ కూడా ఏర్పాటు చేశారు. మోసం కేసు వెలుగుచూసిన అనంతరం నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో 16 శాతం మేర పతనమైన ఐడీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు నేడు కోలుకున్నాయి. ఎన్‌ఎస్‌ఈలో ఒక శాతం లాభంతో రూ.71.08 వద్ద ట్రేడవుతోంది. హరియాణా ప్రభుత్వానికి సంబంధించి కొన్ని ఖాతాలకే ఈ మోసం పరిమితమైందని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టరు, సీఈఓ వి.వైద్యనాథన్ తెలిపారు. శాఖలోని మిగతా వినియోగదార్ల ఖాతాలకు ఎలాంటి ఇబ్బందీ లేదన్నారు.

## ఉత్తర కొరియా అధికార పార్టీ అత్యున్నత పదవికి మళ్లీ కిమ్



సియోల్: ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్(42) అధికార వర్కర్స్ పార్టీ అత్యున్నత పదవికి తిరిగి ఎన్ని కయ్యారు. దేశ అణ్వాయుధ సామగ్రిని బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారంటూ పార్టీ ప్రతినిధులు కొనియాడినట్లు అక్కడి మీడియా సోమవారం నివేదించింది. రాబోయే అయిదు సంవత్సరాలకు కిమ్ తన రాజకీయ, సైనిక లక్ష్యాలను ఈ సమావేశంలో వివరించినట్లు తెలుస్తోంది. అమెరికా, దాని మిత్ర దేశాలకు హెచ్చరికలు జారీ చేసేలా అణ్వాయుధ వ్యవస్థను కిమ్ రెట్టింపు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. పార్టీ తన శక్తిమంతమైన కేంద్ర కమిటీ కోసం ఒక కొత్త జాబితాను కూడా విడుదల చేసింది. కొత్త సైనిక లక్ష్యాలను ఆవిష్కరించడానికి కిమ్ ఈ సమా వేశాన్ని ఉపయోగించుకుంటారని నిపుణులు పేర్కొన్నారు. ఈ ఎన్నిక కిమ్ నాయకత్వాన్ని మరింత బలపరిచిందని దక్షిణ కొరియా ఏకీకరణ మంత్రిత్వశాఖ ప్రతినిధి యూన్ మిన్ హో పేర్కొన్నారు.

## అమెరికాలో తీవ్ర హిమపాతం..

### మూడు రోజుల్లో 10 వేల విమాన సర్వీసులు రద్దు



అమెరికాలో మంచు తుపాను తీవ్ర రూపం దాల్చింది. ఈశాన్య ప్రాంతాల్లో భారీగా మంచు కురుస్తోంది. దీంతో లక్షలాది మంది ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మంచు తుపాను, బలమైన ఈదురు గాలుల కారణంగా రవాణా వ్యవస్థలు స్తంభించాయి. వేలాది విమాన సర్వీసులు రద్దయ్యాయి. తుపాన తీవ్రత దృష్ట్యా విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు విమానయాన సంస్థలు ముందుగానే ప్రకటించాయి. శనివారం నుంచి మంగళవారం మధ్య 10,000 కంటే ఎక్కువ విమాన సర్వీసులు రద్దయినట్లు విమానాల ట్రాకింగ్ సర్వీస్ 'ఫ్లైట్అవేర్' పేర్కొంది. ఇందులో సోమవారమే 5వేల కంటే ఎక్కువ రద్దయ్యాయని తెలిపింది. న్యూయార్క్‌లోని జేఎఫ్‌కే, లగ్వార్డియా విమానాశ్రయాలు, బోస్టన్ లోగన్, నెవార్క్ లిబర్టీ నుంచి రాకపోకలు సాగించాల్సినవే ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది.

పలు రాష్ట్రాల్లో రైలు, బస్ సేవలు కూడా నిలిచిపోయాయి. న్యూయార్క్ నగరంలోని సెంట్రల్ పార్కులో 15 అంగుళాల కంటే ఎక్కువ మంచు కురిసింది. మరికొన్ని ప్రాంతాల్లో రెండు అడుగులకుపైనే మంచు పేరుకుపోయింది. ఈ భారీ హిమపాతం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో లక్షలాది ఇళ్ల, వ్యాపార సముదాయాలు అంధకారంలో చిక్కుకుపోయాయి. విద్యుత్ సేవలను పునరుద్ధరించేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారని అధికారులు తెలిపారు.

## డాలర్ ఆధిపత్యానికి చెక్

- అమెరికా కరెన్సీకి పోటీగా చైనా అడుగులు
- 'కియుషి'లో జిన్‌పింగ్ కీలక వ్యాసం



బీజింగ్: ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దశాబ్దాలుగా ఆధిపత్యం చెలాయిస్తున్న అమెరికా డాలర్ కోటను బద్దలుకొట్టడానికి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సరికొత్త వ్యూహరచన చేస్తున్నారు. చైనా కరెన్సీ అయిన 'యువాన్'ను అంతర్జాతీయ స్థాయిలో అత్యంత 'బలమైన కరెన్సీ'గా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవడమే కాకుండా, యువాన్‌ను 'గ్లోబల్ రిజర్వ్ కరెన్సీ'గా మార్చడమే తమ అంతిమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. శనివారం కమ్యూనిస్ట్ పార్టీ అధికారిక పత్రిక 'కియుషి'లో ప్రచురితమైన ఒక వ్యాసంలో జిన్‌పింగ్ ఈ విషయాలను వెల్లడించారు.


ఆ వ్యాసంలో జిన్‌పింగ్ అమెరికా డాలర్ పేరును నేరుగా ప్రస్తావించలేదు. కానీ ఉద్దేశం మాత్రం స్పష్టంగా అర్థమవుతోంది. అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడులు, విదేశీ మారక ద్రవ్య మార్కెట్లలో యువాన్ వాడకాన్ని భారీగా పెంచాలని ఆయన సూచించారు. చైనాను ప్రపంచంలోనే గొప్ప ఆర్థిక శక్తిగా మార్చడానికి 'బలమైన కరెన్సీ' అత్యవసరమని తేల్చిచెప్పారు.

పెద్దదే, కానీ బలం చాలదు

ప్రస్తుత చైనా ఆర్థిక పరిస్థితిపై జిన్‌పింగ్ ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు. "ప్రపంచంలో బ్యాంకింగ్ ఆస్తులు, విదేశీ మారక నిల్వలు, క్యాపిటల్ మార్కెట్ పరిమాణంలో చైనా అగ్రగామిగా ఉంది. మనది చాలా పెద్ద దేశం. కానీ ఆర్థికంగా ఇంకా 'బలమైన' దేశంగా మారాలి. చైనాను నిజమైన ఫైనాన్షియల్ పవర్ హౌస్‌గా మార్చడం అనేది ఒక దీర్ఘకాలిక ప్రక్రియ" అని ఆయన పేర్కొన్నారు. అయితే అమెరికా ఆంక్షల నుంచి తప్పించుకోవడానికి చైనా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేస్తోంది. అంతర్జాతీయ బ్యాంకింగ్ లావాదేవీల నెట్‌వర్క్ 'స్విఫ్ట్' అమెరికా గుప్పెట్లో ఉంది. దీనికి పోటీగా చైనా, రష్యాలు కలిసి 'సిప్స్' (సీఐపీఎస్- క్రాస్-బోర్డర్ ఇంటర్బ్యాంక్ పేమెంట్ సిస్టం)ను ప్రోత్సహిస్తున్నాయి. రష్యా నుంచి ఆయిల్, గ్యాస్ కొనుగోలులో చైనా ఇప్పుడు యువాన్‌నే వాడుతోంది. గత ఏడాది చైనా తన మొత్తం 6.2 ట్రిలియన్ డాలర్ల విదేశీ వాణిజ్యంలో, దాదాపు మూడో వంతు వాణిజ్యాన్ని సొంత కరెన్సీలోనే జరిపింది.

**ట్రంప్ వార్నింగ్ :** బీజింగ్, మాస్కోలు ఇప్పుడు 'బ్రిక్స్' వేదికగా డాలర్‌కు చెక్ పెట్టాలని చూస్తున్నాయి. 10 దేశాల కూటమిగా మారిన బ్రిక్స్, ఉమ్మడి కరెన్సీని లేదా 'బ్రిక్స్ పే' సిస్టమ్‌ను తీసుకురావాలని యోచిస్తోంది. ఈ ఏడాది భారత్ వేదికగా జరగనున్న బ్రిక్స్ సదస్సులో దీనిపై చర్చ జరిగే అవకాశం ఉంది. అయితే, డాలర్ ఆధిపత్యాన్ని సవాలు చేస్తే బ్రిక్స్ దేశాలపై భారీ సుంకాలు విధిస్తామని ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. అయితే ఈ బెదిరింపులకు చైనా లంగడం లేదు. పాశ్చాత్య దేశాల ఆర్థిక నమూనాకు భిన్నంగా చైనా నమూనా ఉంటుందని జిన్‌పింగ్ తెలిపారు.

## తైవాన్‌లో భూకంపం



తైపీ : తైవాన్‌లో మంగళవారం స్వల్ప భూకం పం చోటుచేసుకుంది. తైవాన్ ఈశాన్య కౌంటీ యిలాన్ తీరంలో 5.6 తీవ్రతతో భూకంపం వచ్చి నట్లు వాతావరణ విభాగం తెలిపింది. భూకంప కేంద్రం 66.8 కి.మీ (41.5 మైళ్లు) లోతులో, కౌంటీ ప్రభుత్వ స్థానం నుండి 16.9 కి.మీ దూరంలో మరియు తీరప్రాంత జలాల్లో ఉందని పేర్కొంది. భూకంపం ధాటికి రాజధాని తైపీలో భవనాలు కొద్దిసేపు కంపించాయి. తైవాన్ రెండు టెక్టోవిన్ ప్లేట్ల జంక్షన్ సమీపంలో ఉందని మరియు భూకంపాలకు గురయ్యే అవకాశం ఉందని తెలిపింది. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన నివేదికలు రావాల్సి వుంది.


## నేను ఎంతకాలం ఉంటానో తెలియదు: ట్రంప్



తనపై జరుగుతోన్న వరుస హత్యాయత్నాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. తనను హత్య చేయడానికి చాలా మంది ప్రయత్నాలు చేస్తున్నారని.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే తాను ఎంత కాలం ఉంటానో కూడా తెలియట్లేదన్నారు. ఇటువంటి షూటర్లు సాధారణ అధ్యక్షుల జోలికి వెళ్లరని.. కేవలం అసాధారణ విజయాలు సాధించే అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని అన్నారు. ఈ సందర్భంగా అమెరికా మాజీ అధ్యక్షులు అబ్రహం లింకన్, జాన్ ఎఫ్. కెన్నడీ హత్య ఘటనలను ఉదాహరణగా పేర్కొన్నారు. ఇలాంటి ఎన్ని బెదిరింపులకు పాల్పడినా.. తాను తీసుకునే నిర్ణయాలపై ఏ మాత్రం వెనక్కి తగ్గబోనన్నారు. ఇటీవల ఫ్లోరిడాలోని తన నివాసంలోకి ఓ సాయుధ దుండగుడు చొరబడిన ఘటనపై స్పందిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. శనివారం అర్ధరాత్రి సమయంలో ఓ దుండగుడు ఫ్లోరిడాలోని ట్రంప్ నివాసంలోకి ప్రవేశించాడు. అతడి చేతిలో ఆయుధంతో పాటు ఇంధనం క్యాన్ ఉన్నట్లు సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు గుర్తించారు. వాటిని కిందపడేయాలని హెచ్చరించినా ఆ దుండగుడు వినకపోవడంతో భద్రతా సిబ్బంది అతడిని హతమార్చారు. కాగా.. ట్రంప్‌పై గతంలోనూ పలుమార్లు హత్యాయత్నాలు జరిగిన విషయం తెలిసిందే. 2024 జులైలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయనపై ఓ వ్యక్తి కాల్పులు జరిపాడు. ఆ ఘటనలో ట్రంప్ చెవి భాగం నుంచి తూటా దూసుకెళ్లింది. ఆ తర్వాత ఓసారి ట్రంప్ పామ్ బీచ్ గోల్ఫ్ కోర్స్‌లో రైఫిల్‌తో అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తినీ పోలీసులు అరెస్టు చేశారు.

## నెదర్లాండ్ ప్రధానిగా రాబ్‌జెట్టెన్ ప్రమాణం..


### పిన్న వయస్కుడిగా రికార్డు



హేగ్ : నెదర్లాండ్ ప్రధానిగా రాబ్ జెట్టెన్ అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. డచ్ రాజకీయాల్లో అతి పిన్న వయస్కుడైన ప్రధానిగా జెట్టెన్ చరిత్ర సృష్టించారు. హౌస్‌టెన్ బాష్ ప్యాలెస్‌లో మంగళవారం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. శరణార్థుల విధానంపై తీవ్ర విమర్శలు ఎదురవడంతో డిక్ స్కూఫ్ నేతృత్వంలోని అతిమితవాద ప్రభుత్వం 11 నెలల క్రితం కుప్పకూలిన సంగతి తెలిసిందే. అనంతరం గతేడాది అక్టోబర్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో డెమోక్రాట్స్ (ప్రొగ్రెసివ్ లిబరల్స్ (డి66))కి చెందిన రాబ్ జెట్టెన్ అనూహ్య విజయం సాధించారు. యూరోపియన్ సహకారం మరియు ప్రగతి శీల ప్రణాళికలతో జెట్టెన్ అతిమితవాద నేత గీర్ట్ వైల్డర్స్‌ను ఓడించి అధికారంలోకి వచ్చారు. ప్రొగ్రెసివ్ లిబరల్స్ (డి66), లిబరల్ కన్జర్వేటివ్ (వివిడి), క్రిస్టియన్ డెమోక్రాట్స్ (సిడిఎ) కూటమి మద్దతుతో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. డచ్ రాజకీయాల్లో తీవ్రమైన అనిశ్చితుల మధ్య జెట్టెన్ విజయం సాధించడం గమనార్హం. కొత్త నగరాలు, పట్టణాల నిర్మాణంతో దేశంలో తీవ్రమైన గృహ కొరతను పరిష్కరించనున్నట్లు జెట్టెన్ ప్రకటించారు. మానవీయ వలస [illegible] అయితే 155 మంది సభ్యులు గల పార్లమెంటులో ఈ కూటమికి 66 సీట్లు మాత్రమే ఉన్నాయి. ఫలితంగా, చట్టాల కోసం ప్రతిపక్షాల మద్దతు కూడగట్టడం జెట్టెన్‌కు సవాలుగా మారనుంది. 'సహకారంతో విభేదాలను అధిగమించడం తన లక్ష్యం' అని ప్రమాణ స్వీకారం అనంతరం రాబ్ జెట్టెన్ సోషల్‌మీడియాలో పేర్కొన్నారు. అలాగే స్వలింగ సంపర్కుడిగా బహిరంగంగా వెల్లడించిన దేశంలోని మొదటి నేత కూడా ఆయనే కావడం గమనార్హం.

## భారత్ ఆయిల్ కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు

### మాకు ఎలాంటి సమాచారం లేదు



మాస్కో : ఆయిల్ కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు రష్యాకు భారత్ నుంచి ఎలాంటి సమాచారం లేదని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ మంగళవారం తెలిపింది. క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ మంగళవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. అలాగే, భారత్‌తో అన్ని సంబంధాలను అభివృద్ధి చేసుకోవాలని రష్యా భావిస్తోందని పెస్కోవ్ తెలిపారు. భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిందని, దీని ప్రకారం రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపివేయడానికి భారత్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన ఒక రోజు తరువాత పెస్కోవ్ ఈ విషయాన్ని తెలిపారు. అయితే రష్యాకు ఎలాంటి సమాచారం లేకపోయినా, ఆ దేశం నుంచి భారత్ చేస్తున్న చమురు కొనుగోళ్లు గణనీయంగా తగ్గినట్లు కొన్ని నివేదికలు చెబుతున్నాయి. రియల్ టైమ్ అనలిటిక్స్ కంపెనీ కప్లెర్ సమాచారం ప్రకారం ఈ ఏడాది జనవరిలో రష్యా నుంచి భారత్ చేసిన ఆయిల్ కొనుగోళ్లు ఒక మిలియన్ బ్యారెళ్లకు పడిపోయాయి. అంతకు ముందు నెలలో ఇది రెండు మిలియన్ బ్యారెళ్లకు పైగా ఉండేది. మరోవైపు కప్లెర్ సంస్థ సమాచారం ప్రకారం రష్యాకు బదులుగా ఇరాక్ నుంచి భారత్ చమురు కొనుగోళ్ళు పెరిగాయి. అలాగే, సౌదీ అరేబియా నుంచి కూడా కొనుగోళ్లుపెరిగినట్లు కప్లెర్ తెలిపింది. భారత్ తనకు అవసరమయ్యే ముడి చమురులో 88 శాతాన్ని విదేశాల నుంచే కొనుగోలు చేస్తుంది.

## బెంగాల్‌లో జ్యుడీషియల్ అధికారుల

### సంఖ్యను పొడిగించండి : సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : పశ్చిమబెంగాల్ ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం సుప్రీం కోర్టు ఎక్కువమంది జ్యుడీషియల్ అధికారులను నియమించాలని కోల్‌కతా హైకోర్టును ఆదేశించింది. "భారీ వ్యాయామం"లో ప్రమాదాలను వివరిస్తూ కోల్‌కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుండి లేఖ అందిన తర్వాత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం అత్యవసరంగా సమావేశమైంది. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం (ఇసి)కి సాయం చేసేందుకు జ్యుడీషియల్ అధికారుల సంఖ్యను పెంచాలని ఆదేశించింది. ధృవీకరణ ప్రక్రియను నిర్వహించడానికి ఎంపిక చేయబడిన 294 జిల్లా మరియు అదనపు జడ్జీలు కేవ లం సముద్రంలో చుక్క మాత్రమేనని కోల్‌కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేఖలో పేర్కొన్నారు.

## ఇరాన్‌లో కూలిన

## ఆర్మీ హెలికాప్టర్



టెహ్రాన్ : ఇరాన్ ఆర్మీ హెలికాప్టర్ మంగళవారం కూలిపోయింది. ఈ ఘటనలో పైలెట్, కో పైలెట్ సహా నలుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు దక్షిణంగా 330కి.మీ దూరంలో ఉన్న డోర్చే పట్టణంలో ఈ ప్రమాదం జరిగిందని ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. ఇస్ఫహాన్‌లో ఇరాన్ ప్రధాన వైమానిక స్థావరం, అణు కేంద్రం ఉన్నాయి. ఈ అణు కేంద్రంపై గతేడాది జూన్‌లో ఇజ్రాయిల్‌కు మద్దతుగా అమెరికా దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ హెలికాప్టర్‌ను శిక్షణ కోసం వినియోగిస్తున్నారని, శిక్షనిస్తుండగా కూరగాయల మార్కెట్‌పై కూలిపోయిందని ఇరాన్ అధికారులు తెలిపారు. ప్రమాదంలో సిబ్బందిసహా మార్కెట్‌లోని ఇద్దరు వ్యక్తులు మరణించారని అన్నారు. వారంలో ఇది రెండవ ప్రమాదం. ఇరాన్ పశ్చిమ నగరమైన హమెడాన్ సమీపంలో ఎఫ్-4 యుద్ధ విమానం కూలిపోవడంతో పైలెట్ మరణించారు.

## మాకంటే వారి వద్దే

### శక్తిమంతమైన ఆయుధాలు : పాక్ మంత్రి



పాకిస్థాన్ ప్రభుత్వానికి కొన్నేళ్లుగా బలోచ్ రెబెల్స్ పంటి కింద రాయిలా మారారు. వారివద్ద అమెరికా ఆయుధాలు ఉన్నాయని పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలు చేశారు. వాటిలో నైట్ విజన్ డివైజ్‌లు, రైఫిళ్ల వంటి అధునాతన ఆయుధాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాంటివి తమ సైన్యం వద్ద కూడా లేవన్నారు. ఈ మేరకు ఆయన నేషనల్ అసెంబ్లీలో మాట్లాడారు. పాక్ ప్రావిన్స్ బలోచిస్థాన్ వైశాల్యం, రెబెల్స్ వద్ద ఉన్న అధునాతన ఆయుధాల కారణంగా వారితో పోరాడేందుకు పాక్ సైన్యం ఇబ్బందిపడుతోందని మంత్రి అంగీకరించారు. "వారివద్ద 2 మిలియన్ల విలువైన రైఫిల్ ఉంది. అది మనవద్ద లేదు. 4000 డాలర్లు నుంచి 5000 డాలర్ల విలువైన థర్మల్ వెపన్ సైట్స్ ఉన్నాయి. ఇలాంటి ఆయుధాలన్నీ వారికి ఎక్కడినుంచి వస్తున్నాయి..? వీటిల్లో కొన్ని అమెరికా ఆయుధాలు కూడా ఉన్నాయి. ఈ ఉగ్రవాదుల నాయకులు అఫ్ఘానిస్థాన్‌లో ఉన్నారు. అక్కడి నుంచే వారికి మద్దతు లభిస్తోంది. ప్రభుత్వవ్యతిరేక కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నవారితో చర్చలు జరపలేం. దాడులు ఆపకపోతే.. పరిణామాలు తీవ్రంగా ఉంటాయి" అని బలోచ్ రెబెల్స్‌ను మంత్రి హెచ్చరించారు. ఇరాన్, అఫ్ఘానిస్థాన్ సరిహద్దుకు సమీపంలోని బలోచిస్థాన్ కేంద్రంగా వేర్పాటువాద సంస్థ బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీూా) కార్యకలాపాలు నిర్వహిస్తోంది. దీనిని అమెరికా ఉగ్రసంస్థగా గుర్తించింది. ఈ సంస్థ సైన్యానికి చెందిన మౌలికసదుపాయాలు, పోలీసులు, స్థానిక అధికారులపై కొన్నేళ్లుగా దాడులు చేస్తోంది. ఇటీవల బలోచిస్థాన్ ప్రావిన్సులోని వేర్వేరు ప్రాంతాల్లో రెబెల్స్ దాడులు చేశారు. దాంతో పాకిస్థాన్ కౌంటర్ ఆపరేషన్ నిర్వహించింది. ఈ ఘటనల్లో 200 మంది వరకు రెబెల్స్‌తో పాటు పౌరులు, భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు.

### ఇరాన్‌తో ఉద్రిక్తతల వేళ.. అమెరికా యుద్ధనౌకలో

## 'టాయిలెట్ వార్'



అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతోన్న నేపథ్యంలో ఇప్పటికే భారీస్థాయిలో అమెరికా సైన్యం ఇరాన్‌ను చుట్టుముట్టిన విషయం తెలిసిందే. అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ సహా పలు యుద్ధనౌకలను ఇరాన్ దిశగా తరలించింది. అయితే యుద్ధం ప్రారంభించకముందే అమెరికా సిబ్బంది తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. విమాన వాహక నౌకలో విధులు నిర్వహిస్తోన్న 4500 సిబ్బంది 'టాయిలెట్' కష్టాలను ఎదుర్కొంటున్నట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదికలు వెల్లడిస్తున్నాయి. నివేదికల ప్రకారం.. ఎనిమిది నెలలుగా నడి సముద్రంలో ఉన్న యుద్ధనౌకలోని మురుగునీటి వ్యవస్థలో ఇటీవల వైఫల్యం తలెత్తింది. యుద్ధనౌక నిరంతరం కదులుతున్నందున, సరైన నిర్వహణ లేకపోవడం వల్ల అందులో ఉన్న మొత్తం 650 మరుగుదొడ్లలో చాలా వరకు పనిచేయడం లేదు. దీంతో మహిళా సిబ్బందితో పాటు పురుషులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాత్రూంను ఉపయోగించు కోవాలంటే సిబ్బంది రోజు దాదాపు 45 నిమిషాల పాటు క్యూలో నిల్చోవాల్సి వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి నౌకలోని సాంకేతిక నిపుణులు రోజుకు 19 గంటలు పనిచేస్తున్నా లాభం లేకుండా పోతోంది.

## వినూత్నమైన ఆలోచనలతో ముందుకు వెళ్లాలి

**- కెయూ ఉపకులపతి ఆచార్య కె. రాంజీ .**

**- లీడర్షిప్ ఎక్సెన్స్ అచీవ్మెంట్ ప్రోగ్రామ్.**



**మచిలీపట్నం ఫిబ్రవరి 24( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విద్యార్థులు, యువత వినూత్నమైన ఆలోచనలతో ముందుకు వెళ్లాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. రాంజీ పిలుపునిచ్చారు. మంగళవారం సత్యసాయి సేవా సమితి సౌజన్యంతో ఏర్పాటుచేసిన లీడర్షిప్ ఎక్సెన్స్ అచీవ్మెంట్ ప్రోగ్రామ్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 789 ఫార్ములాను పాటించాలని, ఏడు గంటల నిద్ర, ఎనిమిది గంటల చదువు, తొమ్మిది గంటల ఇతర వ్యాపకాలు కోసం కేటాయించాలని సూచించారు. రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశ గొప్పదనాన్ని విదేశాల్లో చాటిన వివేకానందుని స్ఫూర్తి తో ముందుకు సాగాలన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. ఉష ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి, మచిలీపట్నం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఆంజనేయ కుమార్, సౌభాగ్యలక్ష్మి, సాయికృష్ణ చైతన్య తదితరులు ప్రసంగించారు. అనంతరం లీడర్షిప్ ఎక్సెన్స్ అచీవ్మెంట్ ప్రోగ్రామ్ పై జిల్లా సత్యసాయి సేవా సంస్థ ల అధ్యక్షులు కొమరగిరి చంద్రశేఖర్ తనదైన శైలిలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. విద్యార్థిని విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు.

## కౌన్సిల్ ఆమోదం పొందని పట్టాభి సీతారామయ్య మెమోరియల్ స్థలం



**మచిలీపట్నం ఫిబ్రవరి 24( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నం నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన హాట్ హాట్గా జరిగింది. నగర అభివృద్ధి, ప్రాధాన్య సమస్యలు, పెండింగ్ పనులు వంటి అంశాలపై చర్చలు సాగినప్పటికీ సభ వాతావరణం రాజకీయ వేడితో కాసేపు ఉద్రిక్తంగా మారింది. అధికారుల తీరుపై వైసిపి పార్టీ కార్పొరేటర్లు స్పందించారు అధికార ప్రతిపక్ష పార్టీల సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ముఖ్యంగా ఎజెండా అంశంలో ఉన్న స్వతంత్ర సమరయోధులు, ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు పట్టాభి సీతారామయ్య మెమోరియల్కు స్థలం కేటాయింపు అంశంపై తీవ్ర స్థాయిలో చర్చించే సమయంలో ఆరోపణలు, గుప్పించుకుంటూ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టాభి సీతారామయ్య స్థలం అంశం మళ్లీ కౌన్సిల్ ఆమోదం లేకుండానే సమావేశం ముగిసింది.

## యువత కేవలం చదువుకే పరిమితం కావొద్దు..




**కావలి ఫిబ్రవరి 24( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నెల్లూరు 'మేరా యువ భారత్', కావలికి చెందిన 'ది పూర్ పీపుల్ వాలంటీర్ ఆర్గనైజేషన్' సంయుక్త ఆధ్వర్యంలో కావలి పట్టణంలో యువ మండల్ వికాస్ అభియాన్ కార్యక్రమాన్ని జరిపించారు. యువతలో సామాజిక స్పృహ పెంపొందించడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి మాట్లాడుతూ.. యువత కేవలం చదువుకే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. మేరా యువ భారత్ వేదిక ద్వారా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## దిగువ అహోబిలంలో హుండీ లెక్కింపు



**ఆళ్లగడ్డ ఫిబ్రవరి 24( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం దిగువ అహోబిలంలో హుండీ లెక్కింపు చేపట్టారు. మూడు నెలలపాటు భక్తులు కానుకల రూపంలో హుండీలో నగదు, నగలు సమర్పించగా.. ఆలయానికి రూ. 28.57 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ ఏవో రామానుజన్ తెలిపారు. బంగారం 14.3 గ్రాములు, వెండి 443 గ్రాములు వచ్చినట్లు వెల్లడించారు. అలాగే స్వామి పార్వేట ఉత్సవ హుండీ నగదును లెక్కించారు. అందులో రూ. 9.14 లక్షలు, బంగారం 1.8 గ్రాములు, వెండి 80 గ్రాములు కానుకల రూపంలో వచ్చిందని ఏవో తెలిపారు.

## పేదల వైద్య ఖర్చులకోసం మంత్రి కొల్లు రవీంద్ర కృషి అభినందనీయం



**మచిలీపట్నం ఫిబ్రవరి 24( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక సహాయం అందించడానికి ఎంతో దోహదపడు తుందని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ అన్నారు. మచిలీపట్నం నగర కార్పొరేషన్ 47 వ డివిజన్ నందు డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, ఆళ్ల మాధవ సహకారంతో మంత్రి కొల్లు రవీంద్ర సూచనల మేరకు మాకర్ల లహరి శేషు లత అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నందున వైద్య ఖర్చుల నిమిత్తం 24001 రూపాయల చెక్కును బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, 47 డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, ఆళ్ల మాధవ లు ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి కొల్లు రవీంద్ర సహకారంతో మచిలీపట్నం నియోజకవర్గంలో అనారోగ్యం తో ఇబ్బందులు పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే ముఖ్యమంత్రి సహాయనిధి ఇప్పించడం జరుగుతోంది అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయనిధి రావాలి అంటే పేద ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారని, నేడు మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే ఆర్థిక ఇబ్బందులతో వైద్య సహాయం కోసం ఎదురు చూసే వారికి మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్యమంత్రి సహాయనిధి వెంటనే ఇప్పించడం చూస్తుంటే ఆ సహాయనిది అందుకున్న వారు ఎంతో ఆనందిస్తూ మంత్రి కొల్లు రవీంద్ర కృషి పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు అన్నారు. మచిలీపట్నం నియోజకవర్గం ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం మంత్రి కొల్లు రవీంద్ర విశేష కృషి చేస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో 47 డివిజన్ తెలుగుదేశం పార్టీ సెక్రటరీ పామర్తి కార్తీక్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతి కోసమే దివ్యజ్ఞాన సమాజం



**మచిలీపట్నం ఫిబ్రవరి 24( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రపంచ శాంతి కోసమే భారతదేశం వ్యాప్తంగా దివ్యజ్ఞాన సమాజం కృషి చేస్తుందని ప్రముఖ ఆడిటర్ సీనియర్ సభ్యులు సి. శేషాచార్యులు (అప్పాజీ )అన్నారు. ఇటీవల రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర దివ్యజ్ఞాన సమాజ సదస్సుకు మచిలీపట్నం నుండి హాజరైన ఆరు సభ్యులను సన్మానించడానికి మచిలీపట్నం దివ్యజ్ఞాన సమాజం మంగళవారం సాయంత్రం ఈడేపల్లి లో ని ఆల్కట్ లాడ్జ్ బిల్డింగ్ లో మచిలీపట్నం శాఖ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అధ్యక్షతన మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆడిటర్ అప్పాజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కాలాతీత జ్ఞానానికి అంకితం కావాలని, నిత్యం సత్యము అనేది అంతులేని శక్తిని ఇస్తుందని అన్నారు. జిడ్డు కృష్ణమూర్తి రచనల ద్వారా ప్రతి ఒక్కరూ స్వయంకృషితో ఎదగాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మజ్ఞానం పొందాలని అప్పాజీ అన్నారు. కులాలకు మతాలకు ప్రాంతాలకి అతీతంగా ప్రతి ఒక్కరు సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని అప్పాజీ అన్నారు. దివ్యజ్ఞాన సమాజం జాతీయ స్పీకర్ విశ్రాంత అధ్యాపకులు సవరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వివిధ మతాల సర్వోన్నత సత్యాన్ని అందరూ గ్రహించాలని, అన్ని మతాల మానవ మహోన్నత విలువలను నేటి యువతరం అందించాలని అన్నారు. అందు కోసం దివిజ్ఞాన సమాజం 150 సంవత్స రాలుగా కృషి చేస్తుందని తెలియజేశారు. మచిలీపట్నం దివ్యజ్ఞాన సమాజం అధ్యక్షులు న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి సదస్సులో రాజమండ్రిలో గత వారం మచిలీపట్నం నుండి ఆరుగురు సీనియర్ సభ్యులు హాజరు కావడం అభినందనీయమని అన్నారు. సమాజ మార్పు కోసం యువతలో నైతిక విలువలు పెంచడం కోసం దివ్యజ్ఞాన సమాజం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. మరో సీనియర్ సభ్యులు కారుమూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సర్వకాలీనమైన సత్యాన్ని తెలుసుకోవడమే దివ్యజ్ఞానం అని అన్నారు. ప్రతి ఒక్కరూ వారిలోని అంతర్గత శక్తులను తెలుసుకోవాలని అన్నారు. ద్వ్యజ్ఞాన సమాజం కార్యదర్శి కొత్తకొండు రమేష్ రాష్ట్ర సదస్సు కార్యక్రమాలను వివరించారు. అనంతరం గౌరవ అధ్యక్షులు అప్పాజీని రాష్ట్ర సదసు కి హాజరైన ఆరుగురు సభ్యులను మచిలీపట్నం దివ్య జ్ఞాన సమాజం సన్మానించింది. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఎం. సత్యనారాయణ సీనియర్ న్యాయవాది గుడిసేవ మురళి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## జనగణన గణాంకాలు దేశ అభివృద్ధికి బలమైన పునాది: కలెక్టర్




**నంద్యాల ఫిబ్రవరి 24( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** దేశ అభివృద్ధి ప్రణాళికలకు జనగణన గణాంకాలు బలమైన పునాది అని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని అయ్యలూరు మెట్టలో ఉన్న ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన జనగణన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. . దేశ అభివృద్ధి ప్రణాళికలకు జనగణన గణాంకాలు, కచ్చితమైన, సమగ్రమైన, పారదర్శక సమాచార సేకరణ అవసరమన్నారు. వీటితోనే ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు స్పష్టమైన దిశానిర్దేశం లభిస్తుందని తెలిపారు. జనగణన ప్రక్రియలో ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలని, ఇంటింటి సమాచారాన్ని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నమోదు చేయాలని ఆదేశించారు. సేకరించిన గణాంకాల ఆధారంగానే విద్య, వైద్యం, ఉపాధి, గృహనిర్మాణం, మౌలిక వసతుల ప్రణాళికలు రూపుదిద్దుకుంటాయని పేర్కొన్నారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు అప్రమత్తంగా పని చేయాలని సూచించారు.

## పప్పు శనగలను.. ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేస్తోంది



**హాలహర్వి ఫిబ్రవరి 24( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రబీ సీజన్లో సాగు చేసిన పప్పు శనగలను ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేస్తుందని ఆలూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు చెంగల రాయుడు పేర్కొన్నారు. మంగళవారం హాలహర్వి మండల కేంద్రంలో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో పప్పు శనగ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్వింటాకు రూ.5,875 చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. పంట నమోదు చేసుకున్న అన్నదాతలు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో జిలానీ, మార్క్ ఫెడ్ అధికారులు ప్రకాశ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## అహోబిలంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు



**ఆళ్లగడ్డ ఫిబ్రవరి 24( నేటి మనదేశమ్ ప్రతినిధి) :**ప్రముఖ వైష్ణవ క్షేత్రం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహ స్వామి, శ్రీదేవి అమ్మవారిని విశేషంగా అలంకరించి ఉత్సవం జరిపారు. దిగువ అహోబిలంలో ప్రహ్లాద వరద స్వామి ప్రత్యేక అలంకరణలో హంస వాహనంపై కొలువుదీరి ఆలయ తిరువీధుల్లో ఊరేగారు. అహోబిలం మఠానికి చేరుకున్న స్వామిని పీఠాధిపతి రంగనాథ యతేంద్ర మహాదేశికన్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఏవో రామానుజన్, ప్రధాన అర్చకుడు క్రీడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

## క్రీడలు దేహదారుఢ్యానికే కాదు మానసికల్లాసానికి కూడా ఎంత దోహదపడతాయి.



**మచిలీపట్నం ఫిబ్రవరి 24( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సైకిల్ పోటీలను ఎంతో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మచిలీపట్నం ఒకటి వార్డ అటల్ బిహారీ ,ఎన్టీఆర్ విగ్రహాల దగ్గరనుంచి మొదలుపెట్టి మాచవరం మసీదు వరకు ఉన్నటువంటి రోడ్డులో పది కిలోమీటర్లు యువకులకు ఆరు కిలోమీటర్ల అమ్మాయిలకి మాస్ పార్టిసిపేషన్ టైమింగ్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో కృష్ణ జిల్లా లోని పలు ప్రాంతాల నుంచి గన్నవరం, కంకిపాడు, గుడివాడ, గూడూరు, మచిలీపట్నం ప్రాంతాల నుంచి వచ్చిన పిల్లలు పాల్గొన్నారు. మంగళవారం జరిగిన పోటీలలో గెలుపొందిన అండర్ 18 బాయ్స్ గర్ల్స్ 28 ఆదివారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని నున్న ప్రాంతంలో రాష్ట్రస్థాయి క్రీడలో కృష్ణా జిల్లా తరపున పాల్గొంటారు . జిల్లాస్థాయి లీగ్ సైకిల్ పోటీలను నిర్వహించినటువంటి క్రమంలో కార్యక్రమాలకు పుర ప్రముఖులు గొట్టిపాటి గోపీచంద్ , 45వ ఇంచార్జ్ ఫణి కుమార్ బ్రాహ్మణ కార్పొరేషన్ ఇంచార్జ్ ,దాస్, జిల్లా పిఈటిసి అసోసియేషన్ సెక్రెటరీ ఎం అరుణ , టౌన్ ఎస్ఐ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిబ్బంది ఎడ్యుకేషన్ టీచర్స్ పాల్గొన్నారు. మెడికల్ అండ్ హెల్త్ వారికి పోలీస్ శాఖకు విద్యా శాఖకు సైక్లింగ్ అసోసియేషన్ మురళి, ఐ డ పి ఆర్ వారికి నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కొనసాగుతోన్న అంగన్వాడీల నిరసన దీక్షలు




**డోన్ ఫిబ్రవరి 24( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అంగన్వాడీ సిబ్బందికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి నేతలు నిలబెట్టుకోవాలని సీఐటీయూ నాయకులు నక్కి శ్రీకాంత్ కోరారు. డిమాండ్ల సాధనే లక్ష్యంగా మూడు రోజులపాటు నిర్వహిస్తున్న నిరసన దీక్షలో భాగంగా.. మంగళవారం సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొనసాగించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరం వద్ద నిరసన తెలిపారు.

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నిత్యాన్నదాన పథకానికి రూ.3 లక్షలు విరాళం



**మోపిదేవి ఫిబ్రవరి 24( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కృష్ణాజిల్లా మోపిదేవి మండలం మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి నిత్యాన్నదానం పథకానికి భక్తులు రూ.3 లక్షలు విరాళం అందజేశారు. హైదరాబాద్కు చెందిన కల్పటపు శేష సాయి, అడవి రాధాకృష్ణమూర్తి. . రమాదేవి, ప్రసాద్ పేరుమీద రూ. లక్ష, కీర్తిశేషులు కల్పటపు కామేశ్వరరావు, అన్నపూర్ణమ్మ, బాల సూర్యనారాయణ మూర్తి జ్ఞాపకార్థం రూ. లక్ష, కీర్తిశేషులు కల్పటపు వీరభద్రయ్య, శేషమ్మ జ్ఞాపకార్థం రూ. లక్షచొప్పున మొత్తం రూ.3 లక్షలు అందించారు. విరాళానికి సంబంధించిన డీడీలను ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదన్కు అందజేశారు. అనంతరం దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

## మదనపల్లె గోవర్ధనగిరి శ్రీకృష్ణ ఆలయంలో భారీ చోరీ



**మదనపల్లి ఫిబ్రవరి 24( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణ శివార్లలోని శ్రీవారి నగర్లో ఉన్న గోవర్ధనగిరి శ్రీకృష్ణ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు భారీ చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతో పాటు డీవీఆర్లను అపహరించారు. స్వామి, వారి బంగారు వెండి, కిరీటాలు, వెండి సామాగ్రితో పాటు హుండీని ధ్వంసం చేసి అందులోని నగదును దొంగిలించారు. ఉదయాన్నే పూజ చేసేందుకు వచ్చిన అర్చకుడు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మదనపల్లి రెండో పట్టణ సీఐ మహమ్మద్ రఫీ తన బృందంతో ఆలయం వద్దకు చేరుకొని విచారణ చేపట్టారు. సుమారు రూ. 30 లక్షలు విలువ చేసే చేసే బంగారు వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్లు కమిటీ సభ్యులు ప్రాథమికంగా తెలిపారు.

## పల్లాలమ్మ ఆలయ వార్షికోత్సవం..

### 11 రకాల ద్రవ్యాలతో అభిషేకాలు



**ఉంగుటూరు ఫిబ్రవరి 24( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఏలూరు జిల్లా రాచూరు గ్రామదేవత పల్లాలమ్మ వార్షిక మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు అమ్మవారికి 11 రకాల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. జనసేన సీనియర్ నాయకుడు వట్టి పవన్ కుమార్, బొమ్మిడి సొసైటీ అధ్యక్షుడు మైలవరపు గోపాలకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని పూలదండలు, విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ నిర్వాహకుడు మంద శ్రీనివాస్ రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and
Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com